ENTERED
ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
20 మార్చి, 2011
ENTERED
KILLING
MERCY
మరణమే శరణమైతే...

# హ్యాపీ బర్త్‌డే

(2011 మార్చి 20 నుంచి 2011 మార్చి 26 వరకు)

వి. అజిత
మార్చి
మేరీకృప-జాన్‌బన్ని
బొమ్మూరు-తూ॥గో



జి. మురళీకృష్ణప్రసాద్
8సం॥, మార్చి-2003
మల్లేశ్వరి-వెంకటసురేష్
యనమలకుదురు-విజయవాడ

పి. అక్షిత్‌రాజ్
1సం॥, మార్చి-24
మౌనిక-లెనిన్‌శ్రీధర్
జియాగూడ-హైదరాబాద్

జి. అభిలాష్
4సం॥, మార్చి-22
రేణుక-నరేష్
గాంధీనగర్-హైదరాబాద్

పివిఎన్ నిఖిల
8సం॥, మార్చి-22
అరుణ-రత్నకుమార్
విశాఖ

పి. ప్రీతికా
7సం॥, మార్చి-20
లావణ్య-శేఖర్‌బాబు
వియాపూర్-హైదరాబాద్

జి. సాత్విక్‌కృష్ణ
మార్చి-20
సరిత-నరేష్
హాలియా-నల్లగొండ

## ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అతికించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి ప్లాట్ నెం. 21/1,
ఎం.హెచ్ భవన్
ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500 020
email-
venkateshcartoon@gmail.com

మనలో మాట

# కనపడని ఓ నేస్తం కోసం...

చిన్ననాటి మిత్రమా...

ఎన్నాళ్లయింది నిన్ను చూసి! ఎన్నేళ్లయింది నీ పిలుపు విని! చిన్నప్పుడు నీకూ మాకూ అసలు ఎడబాటంటూ ఉందా? తువ్వాయిల్లా మేం వీధుల్లో పరుగులు తీస్తుంటే- రివ్వున మాతో పాటు ఎగిరేదానివి. ఇసుక మేటల్లో టపటపా రెక్కలు అల్లాడించి, మధుర సంగీతం వినిపించేదానివి. ఉదయం నీ కిచకిచల మేల్కొలుపుతోనే కదా మేం కళ్లు తెరిచేవాళ్లం. అప్పటికే నువ్వు పెరట్లోంచి వసారాలోకి, వసారాలోంచి ధాన్యం గదిలోకి బోలెడన్ని పచార్లు చేస్తుండేదానివి.



అక్క కన్నా ముందే అద్దంలో నీ అందం దిద్దుకునేదానివి. ఉక్కు ముక్కుతో నిన్ను నువ్వే భలే అందంగా ముద్దులాడుకునేదానివి. ఇంటి గుమ్మానికి తాతయ్య వేలాడదీసిన ధాన్యపు కుచ్చులకు- నువ్వు ఏటవాలుగా వాలినప్పుడే అందం వచ్చేది. నీ జతగాడితో కలిసి పిట్ట గోడపై షికారు చేసినప్పుడు ఆ గోడకు ప్రాణం వచ్చినట్టుండేది. వాకిట్లో ఆరబోసిన ధాన్యం రాశికి మీ దండయాత్రతోనే కొత్త కళ చేకూరేది!

పళ్లెలా తోముకోవాలో, స్నానమెలా చేయాలో చిన్నప్పుడు నీ కథను వినే తెలుసుకున్నాం. 'కాకమ్మ, పిచ్చుకమ్మ కలిసి, తోటలోకి వెళ్లాయంట...' మాకు ఎంత కంఠోపాఠమో! నువ్వు శుభ్రంగా పళ్లు తోముకొని, చక్కగా స్నానం చేస్తే- కాకమ్మ కల్లబొల్లి స్నానం చేసేసి, నీ పండు ఎత్తుకుపోయిందని ఎంత బాధ పడేవాళ్లమో! ఇప్పుడు ఏ అదృశ్య శక్తో ఏకంగా నిన్నే ఎత్తుకుపోయింది! నీ అలికిడి లేక ఇళ్లూ, నీ కిచకిచల్లేక కళ్లాలూ ఎంతగా బోసి పోయాయో!

అవున్లే... మనిషికి సౌకర్యాలు పెరిగేకొద్దీ తనకు తనే ఒంటరై పోతున్నాడు. ప్రకృతితో 'కలిసి' జీవించినవాడు ... నేడు ఆధునిక సౌకర్యాల మధ్య విడివడి బతుకుతున్నాడు. అపార్టుమెంట్లూ, రియల్ ఎస్టేట్లూ, పురుగుల మందులూ, సెల్‌ఫోను టవర్లూ, రేడియేషన్లూ, సౌండు మిషన్లూ.... నీ అదృశ్యానికి సవాలక్ష కారణాలు! కొందరి స్వార్థం, అవినీతి విచ్చలవిడిగా పెచ్చుపెరుగుతుంటే- నువ్వే కాదు పిచ్చుకమ్మా... మనిషితో సహా అనేక బలహీన జీవులు అదృశ్యమైపోతున్నాయ్! ఎవరో తరిమేస్తుంటే సహజ ఆవాసాల నుంచి ఎటెటో పరుగులు పెడుతున్నాయ్!!

ఖనిజ వనరుల కబళింపు పేరుతో విశాఖ మన్యం గిరిజనులూ; సెజ్‌లు, గనుల పేరిట రైతులూ వెళ్లగొట్టబడుతూనే ఉన్నారు. ప్రైవేటీకరణతో ఇప్పటికే విద్యా వైద్యాలను సామాన్యులకు దూరంగా తరిమేశారు. ప్రభుత్వ సేవలకు, సంక్షేమానికీ పనిగట్టుకొని పాతర వేస్తున్నారు. రాజ్యంలో ధనదాహపు రాబందులూ, డైనోసార్లూ స్వైరవిహారం చేస్తున్నాయి. చిన్ని జీవుల ఆవాసాలను, జీవన విధానాలను ఛిన్నాభిన్నం గావిస్తున్నాయి. పారిపోతేనో, పొగిలిపొగిలి ఏడిస్తేనో సమస్య పరిష్కారం కాదు. ప్రతిఘటించి నిలబడితే తప్ప- ఏ విష పరిణామాన్నీ నిలువరించలేం. ఎవరి మనుగడనూ కాపాడుకోలేం!

ఓ బాల్య స్నేహితుడు

(మార్చి 20 పిచ్చుకల దినోత్సవం)

★

## ఈ సంచికలో....


| | | |
|---|---|---|
| టపా | ... | 2 |
| చిన్నకథ | ... | 3 |
| కంటిపాప | ... | 4 |
| కవిత్వమ్ | ... | 6 |
| నవ్వుల్ పువ్వుల్ | ... | 10 |
| కొత్త పుస్తకాలు | ... | 11 |
| చూద్దామా | ... | 12 |
| అట్టమీది కథ | ... | 14 |
| తెల్సా | ... | 17 |
| వికాసం | ... | 20 |
| రుచి | ... | 21 |
| బాలనేస్తాలు | ... | 22 |


## ఇంకా...

సినిమా కబుర్లు ... 8

తెలుగువారి సినీ కళకు తొలి మార్గదర్శి రఘుపతి వెంకయ్య

కథ ... 18

బిచ్చగాడు



మాటలకోట ... 24



## వింత అనుభూతి

ఈ వారం స్నేహలో మన నయాగరా విశేషాలు ఆకర్షించాయి. నయాగరా జలపాతం విశ్వవిఖ్యాతం. ఎత్తైన కొండల నడుమ పుట్లపై ప్రయాణించడం వింత అనుభూతిని కలిగిస్తుంది. అందమైన తోటలు, వనమూలికలు, కావేరి నదీ జలపాతం... ఇలా అన్నీ చక్కగా వివరించారు.

నూతి నారాయణరావు,
గడ్డిఅన్నారం.

## విలువైన విషయాలు

అట్టమీది కథ 'పరీక్షలు... పాఠాలు...' ద్వారా విలువైన విషయాలు తెలిశాయి. సర్వేశ్వరశర్మ గారి వ్యాసాలు 'వికాసం' శీర్షికకే హుందాతనం తెస్తున్నాయి. 'బాలనేస్తాలు' పేజీలు విభిన్నమైన అంశాలతో ఆకట్టుకుంటున్నాయి. ప్రకృతి ఒడిలో పాఠశాల చూడచక్కగా ఉంది. బుల్లి అక్వేరియం, నఖసుందరి... వంటి అంశాలతో 'తెల్సా' గమ్మత్తుగా ఉంది. 'ఈ పేజ్' ద్వారా తొలి మహిళా ప్రోగ్రామర్ 'అడా' విశేషాలు తెలుసుకోగలిగాం. ఈ వారం కవితలు భావగర్భితంగా ఉన్నాయి. 'సినిమా కబుర్లు'లో బాపురే రమణీయం... మానవీయం ద్వారా అందరం ఆ జ్ఞాపకాల పూదోటలో విహరించాం. 'చూద్దామా' ద్వారా హొగెనక్కళ్ జలపాత విశేషాలు తెలుసుకోగలిగాం. 'నవ్వుల్ పువ్వుల్' ఇంకొంచెం నవ్వులు పండిస్తే బాగుండేది. 'మనలో మాట' అమెరికా అంగట్లో అవయవాలు ఆలోచింపజేసేదిగా ఉంది.

నేమాన సుభాష్ చంద్రబోస్,
శ్రీకాకుళం.

## నవ్వించే శైలి

అట్టమీది కథలో చుక్కా రామయ్య గారి సలహాలు, సూచనలు పరీక్షలు రాసే పిల్లలకు చక్కగా ఉపయోగపడతాయి. ఈ వ్యాసం విద్యార్థులకు కౌన్సిలింగ్ లా పనిచేస్తుంది. సిటీ చదువులకు, పల్లెటూరి చదువులకు తేడా చెప్తూ, విదేశాల్లో విద్యావిధానాన్ని చక్కగా వివరించారు. ముళ్లపూడి వెంకట రమణ గారి కథ బాగుంది. వ్యంగ్యంతో కూడిన హాస్య శైలి ఆయనకు తప్ప మరెవరికీ రాదేమో అని అనుకోకుండా ఉండలేం.

విజయ్, గుంటూరు

## అబ్బురం...

బాపు, రమణలను గుర్తుచేసేలా ఈవారం కథ, సినిమా కబుర్లు ఉన్నాయి. నాటి సాక్షి సినిమా నుండి మొన్నటి సుందరకాండ వరకు కాలానుగుణంగా మార్పులు చేసుకుంటూ తమదైన శైలిలో చిత్రాలను నిర్మించిన విశిష్ట స్నేహం వారిది. బుల్లి అక్వేరియం అబ్బురపరిచేలా ఉంది. నఖసుందరి గురించి చదువుతుంటే పుర్రెకో బుద్ధి... అనే సామెత గుర్తొస్తుంది.

రవి, అనకాపల్లి.

## ఆడుతూ పాడుతూ చదివేస్తే...

ఈ పేజీ ద్వారా కొత్త విషయాలు తెలుస్తున్నాయి. 'చూద్దామా'లో మన నయాగరా గురించి చదివిన తర్వాత అటువంటి జలపాతం చూడ్డానికి విదేశాలకు వెళ్లక్కర్లేదు. చూడాలే కానీ మన దేశంలోనూ బోలెడు సుందర ప్రదేశాలు ఉన్నాయనిపిస్తుంది. 'బాల నేస్తాలు'లో బుజ్జిగాడు బొమ్మలు బాగున్నాయి. ప్రకృతి ఒడిలో పాఠశాల ఉంటే పిల్లలు ఆడుతూ పాడుతూ చదివేస్తారేమో. ఇక పిల్లల్ని స్కూలుకి వెళ్లు అని వెంటపడక్కర్లేదు. బాపురే రమణీయం... మానవీయం... ద్వారా ఆనాటి మేటి సినిమాలు గుర్తుచేసుకున్నాం.

లక్ష్మి, ఖమ్మం.

## నేటికీ నడుస్తున్న చరిత్ర

నడుస్తున్న చరిత్ర మోడర్న్ టైమ్స్‌ని చక్కగా వివరించారు. దోపిడీ వ్యవస్థ గురించి, పెట్టుబడిదారీ వ్యవస్థ గురించి 75 ఏళ్ల క్రితమే సినిమా తీశారు. ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ ఆ వ్యవస్థలో మార్పు రాలేదు సరి కదా వాటి రూపాలు విస్తరించాయి. 'పరీక్షలు... పాఠాలు...' వ్యాసం పిల్లలకు, పెద్దలకు చక్కని పాఠంలా ఉంది.

సూర్య, హైదరాబాద్.

## నవ్వించిన వెంకడు

ఈవారం బాలల కథ 'వెంకడు' వెరైటీగా వుంది. కథ చదివి మా పిల్లలు నవ్వుకున్నారు. వెంకన్న అమాయకత్వం పసిపిల్లల్ని బాగా ఆకట్టుకుంది. మరిన్ని వెరైటీ కథలు బాలల పేజీలో ఇవ్వాలని కోరుకుంటున్నాం. ఎందుకంటే వేసవి సెలవులు వస్తున్నాయి కదా. పిల్లలకు కాస్త కాలక్షేపంగా వుంటుంది.



ఇంకా...బాలనేస్తాలు పేజీని కూడా సమ్మర్ స్పెషల్‌గా తీర్చిదిద్దితే మరింత సంతోషం. ఈవారం 'మనలో మాట' ఆలోచింపచేసేలా వుంది. అందరికీ నీతులు చెప్పే అమెరికాలోనే ఈ పరిస్థితి వుండడం విచారకరం. ముందు తన దేశం గురించి, తన ప్రజల గురించి ఆలోచిస్తే మంచిది. ఈ విషయాన్ని మాటలో చక్కగా చెప్పారు. ముళ్లపూడి రమణ స్మృతిగా ఆయన రాసిన బుడుగులోంచి కథ ఇవ్వడం బాగుంది. అలాగే ఆయన తీసిన సినిమాలను కూడా ఒక చోట ఇచ్చి మంచిపని చేశారు. పాఠకులకు వారి సినిమాలన్నిటినీ ఒక్కసారిగా గుర్తుచేసుకునే వీలు కల్పించారు. ధన్యవాదాలు.

కె. మాధవరావు, లక్ష్మీనగర్,
మెదక్.






చిన్నకథ



# శేష ప్రశ్న

అప్పారావు పెళ్లిచూపులకెళ్ళొచ్చి రెండు రోజులైంది. అమ్మాయి తరుపువాళ్లకి ఔననో, కాదనో చెప్పాలి.

"నీ నిర్ణయం ఏంట్రా? ఫోను చేసి చెప్పాలి కదా. మన సమాధానాన్ని బట్టి వాళ్లు నిర్ణయించుకుంటారు" రాత్రి భోజనాల దగ్గర అడిగాడు తండ్రి.

"అమ్మాయి బాగానే ఉంది. చదువే తక్కువ. నా చదువుకి, ఆ అమ్మాయి చదువుకి తేడా ఉంది. కనీసం పట్టా అన్నా ఉంటే ఏదో గుమస్తాగిరన్నా దొరుకుతుంది. ఈ రోజుల్లో ఒకరి సంపాదన చాలదు. ఆమె చదువుకు ఏమీ దొరకదు" తన ఆలోచనలన్నీ బయటపెట్టాడు అప్పారావు.

ఇక ఏం చెప్పినా లాభం లేదని అవతలి వాళ్లకు నెగటివ్‌గా ఫోను చేశారు తల్లిదండ్రులు.

◆◆◆

"అమ్మాయికి చదువుంది. మంచి సంబంధం. ఖాయం చేసుకో" వరసకు మేనమామైన శంకరయ్య ఓ సంబంధం చూసి హెచ్చరించాడు. ఈ సారైనా ఇష్టపడతాడులే అనుకున్నారు తల్లిదండ్రులు.

పెళ్లి చూపులు జరిగాయి. అమ్మాయి తరుపువాళ్లు ఏర్పాట్లు బాగానే చేశారు. ఇంటికెళ్లగానే ఆలోచించుకుని చెప్తామని కదిలారు అక్కణ్ణుంచి.

"అమ్మాయి నీ అంత చదివింది కదా. ప్రయత్నిస్తే ఏదో ఒక చోట పని దొరక్కపోదు. మరి ఈ సంబంధం నచ్చినట్లేనా?"

"చదువు పర్వాలేదు కానీ...."

"కానీ ఏంట్రా మళ్లీ ..." విషయం ఏమిటన్నట్లు అడిగింది తల్లి.

"ఉద్యోగం...."

"అవును. ప్రయత్నిస్తే దొరకదా?"

"నా ఒక్కడికే వెతుక్కోలేకపోతున్నాను. ఇంకొకరికి వెతకాలంటే చాలా కష్టం"

"అంటే..."

"ఉద్యోగం సంపాదించుకున్న అమ్మాయైతే బాగుంటుంది"

"నీవనుకున్నట్లు జరగటం చాలా కష్టం. ఇప్పుడేం చేద్దామంటావ్?"

"ఇంకో సంబంధం చూద్దాం"

అప్పారావు ఆలోచనలు తల్లిదండ్రులకు అయిష్టంగా ఉన్నాయి. లోకానికి విరుద్ధంగా అనిపించాయి.

◆◆◆

"ఏరా బాగున్నావా? పెళ్లయిందా?" చిన్ననాటి స్నేహితుడు రాజారావు పిలుపుకు బజార్లో పరధ్యానంగా నడుస్తున్న అప్పారావు ఆగాడు. ఇద్దరూ దగ్గర్లో ఉన్న చిన్న హోటల్లోకి దారి తీశారు.

తన ఆలోచనలు బయటపెట్టి, వాటికనుగుణంగా ఉన్న సంబంధం ఏదీ దొరకలేదన్నాడు అప్పారావు. నూరు అబద్ధాలాడైనా ఒక పెళ్లి చెయ్యమని పెద్దలు చెప్పిన సామెత గుర్తొచ్చి తనకు చేతనైన సాయం చేద్దామనుకున్నాడు రాజారావు. అబద్ధాలాడకపోయినా అప్పారావును ఒకింటివాడిని చేద్దామనుకున్నాడు. మనసును ప్రపంచం మీదికి నడిపాడు. బుర్రలో ఆలోచన వచ్చింది.

"నాకు తెలిసిన సంబంధం ఒకటుంది. అమ్మాయి చదువుకుంది. ఉద్యోగం కూడా చేస్తోంది. మరి చూద్దామంటే వెళ్దాం"

రాజారావు ఆలోచనకి సరేనన్నాడు అప్పారావు.

"ఈసారైనా వదిన్ని తీసుకొస్తావా అన్నయ్యా?" సందేహిస్తూ అడిగింది చెల్లెలు. అప్పారావు తలూపాడు. ఈసారి కూడా సంబంధం ఖాయమవుతుందో లేదో అనే అనుమానం వెంటాడుతూనే ఉంది. మళ్లీ పెళ్లి చూపులకి కదిలింది ఆ కుటుంబం.

అమ్మాయి బాగుంది. ఇంచుమించు తనంత చదువుకుంది. కొద్దిపాటి ఉద్యోగమూ ఉంది. అతిథి మర్యాదలు బాగానే ఉన్నాయి.

"ఎంతిస్తారు?" అప్పారావు ప్రశ్న అది.

వాళ్లు తమ ఆర్థిక పరిస్థితిని తెలిపారు.

"నా చదువుకి ఉన్న కొద్దిపాటి పొలం అమ్మారు. నాకిచ్చే కట్నంతోనే నా చెల్లెలి పెళ్లి జరగాలి"

"చదువు కావాలన్నావ్. చదువుంది. ఉద్యోగం కావాలన్నావ్. ఉద్యోగముంది. మళ్లీ కట్నం అంటూ పేచీపెడితే ఎలా? ఏదో వాళ్లిచ్చింది తీసుకుని స్వయం శక్తితో ఆర్థిక స్థితిని మెరుగుపర్చుకుని ఇంటి సమస్యలు తీర్చుకోవాలి" రాజారావు సలహా ఇచ్చాడు.

కానీ అప్పారావు తనకింత కావాలని గట్టిగా చెప్పాడు. ఫలితంగా వాళ్లు వెనక్కి వెళ్లారు.

◆◆◆

కాలం గడిచిపోతోంది.

ఉపాధి కోసం తిరుగుతూనే ఉన్నాడు అప్పారావు. రోజూ ఉద్యోగ ప్రకటనలు చూస్తూనే ఉన్నాడు.

ఒకరోజు ఓ ప్రకటన అప్పారావుని ఆకర్షించింది. "పి.జి చదువు, ఉద్యోగం, బ్యాంకు బ్యాలెన్సు ఉన్న వధువుకు వరుడు కావలెను" అదీ ఆ ప్రకటన సారాంశం.

గుంపుగా వెళ్లడం, ఏదీ కుదరక పోవడం వల్ల ఒంటరిగానే ఇంటర్వ్యూకి హాజరు కావాలనుకున్నాడు అప్పారావు. పేపర్లో ఇచ్చిన ఇంటి నెంబరుకు చేరాడు. మర్యాదలు బాగానే ఉన్నాయి.

"మీ చదువు?"

చెప్పాడు.

"ఆస్తిపాస్తులు?"

కుటుంబ పరిస్థితులు తెలిపాడు.

"నా బ్యాంక్ బ్యాలెన్స్ ఎంతో తెలుసా?"

తెలియదన్నట్లు తల అడ్డంగా ఊపాడు.

ఆరంకెల్లో చెప్పింది.

అప్పారావు మౌనంగా ఉన్నాడు.

"ఇప్పుడు మిమ్మల్ని పెళ్లి చేసుకోవాలంటే నాదో షరతు"

ఏమిటన్నట్లు చూశాడు.

"మీరే నాకు ఎదురు కట్నమివ్వాలి"

"ఎందుకు?"

"ఎందుకేమిటి? మీ అంత చదువుంది. ఉద్యోగముంది. మీ వయసు ఉద్యోగానికి మీరిపోయింది. మిమ్మల్ని పోషించాలి. మీ కుటుంబాన్ని ఆదుకోవాలి. మీ స్థానంలో మీ కుటుంబ బాధ్యతలు నెరవేర్చాలి"

శూన్యంలోకి చూస్తుండిపోయాడు అప్పారావు. అసలు తనికి పెళ్లవుతుందా అనేది శేషప్రశ్న.

**- అచ్చుల**

# కంటిపాప

**రాత్రి 8.30 అయ్యింది. దూరంగా ఆకాశాన వున్న చందమామ ఆ పడకగది కిటికీలోంచి తొంగిచూస్తున్నాడు. లోపల మంచం మీద పాండు పండుకొని వున్నాడు. ఆ పక్కనే కుర్చీలో కూర్చుని రాజు కథ ఒకటి చదివి వినిపిస్తున్నాడు జాసన్. మధ్య మధ్యలో పాండుకు కప్పిన దుప్పటి పక్కకు పోకుండా సరిచేస్తున్నాడు. ఇలా తండ్రీ కొడుకులు కథలు చెప్పకోవడం సర్వసాధారణంగా జరిగేదే. అయితే ఇక్కడ ప్రత్యేకత ఏమంటే వీరిద్దరికీ కళ్లు కనిపించవు. లోకాన్ని చూడలేరు. వారి డిక్షనరీలో వెలుగు అనే పదం ఎంత వెతికినా కనిపించదు.**

'మరి జాసన్ కథ చదువుతున్నాడన్నారుగా' అనిపించొచ్చు. అతను చదువుతోంది బ్రెయిలీ కథల పుస్తకం. చేతి వేలితో ఒక్కో లైను తడుముకుంటూ కథ చదివి వినిపిస్తాడు తన ముద్దుల తనయుడికి. మరో ఆశ్చర్యకరమైన విషయమేమంటే పాండు అతని సొంత కొడుకు కాదు. దత్త పుత్రుడు.

పన్నెండేళ్ల కిందటి సంగతి. జాసన్...లాలెనా... ప్రేమించి పెళ్లిచేసుకున్నారు. చూస్తూ చూస్తూ ఓ అంధుణ్ణి పెళ్లాడడమంటే చిన్న విషయం కాదు. అనుక్షణం... అతని వైకల్యాన్ని అంగీకరిస్తూ... సహకరిస్తూ సహజీవనం చేయాలి. అదే అన్నారు లాలెనాకు కావాల్సినవారు. ఆమె ఎవ్వరి మాటా వినలేదు. తన మనసు మాట తప్ప. కంప్యూటర్ కంపెనీలో పనిచేసే జాసన్‌తో పరిచయం ప్రేమగా మారడం తన అదృష్టంగా భావించింది లాలెనా. అతని వ్యక్తిత్వం అంతగా నచ్చేసిందామెకు.

ఇద్దరూ అందరిలాగే తమ వైవాహిక జీవితం గురించి ఎన్నో కలలు కన్నారు. పెరట్లో పిల్లల వెనక పరిగెడుతూ ఆడుకోవాలని, నట్టింట్లో పాపాయి పారాడాలని ఆశపడ్డారు. వాటిని సాకారం చేసుకోవాలని తపనపడ్డారు. ఊబకాయం వల్ల లాలెనాకు పిల్లలు కలిగే అవకాశం లేదని నిర్ధారణ కావడంతో వారి ఆశలు ఆవిరైపోయాయి. అయినా అన్నీ అనుకున్నట్టే జరిగితే అది జీవితం ఎలా అవుతుంది. సినిమా అవుతుందికానీ.

ఉద్యోగార్థం కెనడా నుంచి అమెరికా చేరారిద్దరూ. అక్కడ అంధుల కోసం పనిచేసే కేంద్రంలో ఉద్యోగానికి చేరాడు జాసన్. అక్కడే అతను అంధులకు కంప్యూటర్ ఎలా ఉపయోగించాలో చెప్పేవాడు. నోటి మాట అక్షర రూపంలోకి ఎలా వస్తుందో, ఆ టెక్నాలజీని ఎలా ఉపయోగించుకోవాలో కూడా నేర్పేవాడు. అప్పుడే వారికి ఓ బిడ్డను దత్తతు తీసుకోవాలన్న ఆలోచన వచ్చింది. అయితే జాసన్ ఒక షరతు పెట్టాడు. అన్నీ సక్రమంగా వున్న బిడ్డను దత్తు తీసుకునేకంటే తనలాంటి ఓ గుడ్డిపిల్లవాడిని చేరదీస్తే ఇద్దరికీ ఉపయోగంగా వుంటుందని చెప్పాడు.

అలాంటి బిడ్డ కోసం ఆరా తీస్తుండగా వారికో విషయం తెలిసింది. అంధత్వం వున్న చిన్నారులను దత్తతు తీసుకునే వారికోసం డబ్బు సాయం చేసే సంస్థ గురించి వారి దృష్టికి వచ్చింది. దంపతులిద్దరూ అక్కడికెళ్లి సంతకం చేశారు. అక్కడ వారు చూయించిన పిల్లల ఫొటోలు చూశారు. లాలెనా కళ్లతోనే జాసన్ కూడా చూశాడు. అందులో ఇండియాకు చెందిన పాండు ఫొటో కూడా వుంది. వాణ్ణి తొలిసారిగా చూసినప్పుడు లాలెనాకు తన జాసన్ చిన్నప్పటి ఫొటోలు మదిలో మెదిలాయి. బాల్యంలో బొమ్మలతో ఆడుకునే జాసన్ ఫొటోలు అచ్చం పాండు ఫొటోల్లాగానే అనిపించాయామెకు.

**రెక్కలు కట్టుకుని**

ఇద్దరూ భారత్ పయనమయ్యారు. అంతేనా!





నాన్న చెప్పే కమ్మని కథలు వింటూ...



తాము దత్తతు తీసుకోబోయే పాండు గురించి...వాడి భవిష్యత్తు, వర్తమానం గురించి తమకు వున్న భయాలు, ఆందోళనలు అన్నీ మిత్రులకు ఎప్పటికప్పుడు తెలియచేయడానికి ఒక బ్లాగ్ కూడా ఏర్పాటు చేసుకున్నారు. పాండు ఫొటోలు...వివరాలు...వాణ్ణి తొలిసారి చూచినప్పుడు కలిగిన భావాలు... అక్కున చేర్చుకున్నప్పుడు జలజలా రాలిన ఆనందభాష్పాలు.. వాడి ప్రవర్తన అన్నీ అన్నీ... బ్లాగ్‌లో పెట్టేసేది లాలెనా.

◆◆◆

పాండు పుట్టు గుడ్డి. కన్నవారు వాణ్ణి బెంగుళూరులోని ఓ ఆసుపత్రి గేటు దగ్గర వదిలేశారు. అమ్మానాన్నల ప్రేమ లేదు. ఆకలేస్తే కడుపు నిండా పెట్టే దిక్కులేదు. వంటిమీద మంచి బట్టలు లేవు. లోకాన్ని చూడ్డానికి కళ్లు లేవు. అన్నీ అడ్డంకులే. ఆటంకాలే వాడికి. అలాగే వుంటే బతికి బట్టకడితే భిక్షగాడిగా తయారయ్యేవాడేమో!

అయితే ఓ అనాథ శరణాలయం వారికి దొరికాడు. వాళ్లే ఆ పిల్లవాడి మంచీచెడ్డా చూశారు. అక్కడే జాసన్ లాలెనా దంపతులు వాణ్ణి మొదటిసారి చూశారు. లాలెనాకు వాడు ఎంతగానో నచ్చాడు. వెంటనే ఢిల్లీకి చేరుకొని అవసరమైన వీసా పనులు పూర్తి చేసుకున్నారు. న్యాయస్థానం సమక్షంలో పిల్లవాణ్ణి దత్తు తీసుకున్నారు.

◆◆◆

తాము బస చేసిన హోటల్‌కు తీసుకెళ్లిన జాసన్ దంపతులను పాండు బాగా విసిగించేశాడు. అకస్మాత్తుగా తనకు పరిచయం లేని వారితో గడపాల్సి వచ్చేసరికి కోపం, భయం కలిగింది వాడికి. మంచం మీద నుంచి కిందకు దూకి పారిపోబోయాడు. పేద్దగా ఏడ్చాడు. బిగ్గరగా కేకలు వేశాడు. అన్నిటినీ భరించి ... వాడిని అనునయించి దారికి తీసుకొచ్చేసరికి వారికి చుక్కలు కనిపించేశాయి.

అక్కడి నుంచి ముగ్గురూ అమెరికా చేరుకున్నారు. అప్పుడే పిల్లవాడి పేరును పాండు ఆర్థర్ షియాగా మార్చారు. ఇప్పుడు వాడికి అన్నీ నేర్పాలి. మాటలు, ఆటలు, పాటలే కాదు. తినడం, తాగడం...అన్నీ. అక్కడకు వెళ్లిన రెండు నెలల తర్వాత వాడు తొలిసారిగా పలికిన పదం ఇల్క్ (మిల్క్). పాలను అలా అడిగాడన్నమాట. నర్సరీ శిక్షణకు 11 నెలలు పట్టింది. సొంతగా టిఫిన్ తినడం, గ్లాసులో పాలు తాగడం నేర్చుకున్నాడు. ఇంకా నేర్చుకుంటాడు. ప్రేమగా అక్కున చేర్చుకున్న జాసన్... లాలెనా వుండగా వాడికెందుకు బెంగ. ఆరోగ్య పరంగా కూడా అనేక జాగ్రత్తలు తీసుకున్నారు. కంటి వెనక వున్న కణితిని తీయించారు. అలాగే సమాజం అంగీకరించేలా వాణ్ణి తయారుచేసేందుకు వారెంతగానో ప్రయత్నించారు. గాజు కళ్లను కూడా అమర్చారు. వాడికి సొంతంగా తనకంటూ ఓ పడకగది, కథల పుస్తకాలు, ఆట వస్తువులు అన్నీ ఉన్నాయి.

అన్నిటినీ మించి ఇప్పుడు పాండును కంటిపాపలా చూసుకునే అమ్మానాన్నా వున్నారు. వాడికి ప్రపంచం చూయిస్తున్నారు. వాళ్లతో కలిసి జూకెళతాడు. వెన్నెల్లో ఆడుకుంటాడు. రాత్రుళ్లు తన సొంత పడకగదిలో అమ్మానాన్న చెప్పే కథలు వింటాడు. వాటి ద్వారా ఊహా లోకంలో విహరిస్తాడు. ఇవన్నీ జరుగుతాయని చిన్నారి పాండు ఏనాడూ ఊహించలా. ఊహించనివి జరగడమే జీవితం!

**-చరిత**

లాలెనా లాలనలో...

# బీద బాధ



బట్టల మడతలతో ముడతలు పడ్డ శరీరం
కుడుతూనే ఉంది - బాధ పడుతూనే ఉంది
ఆకలితో, అలసటతో... కోడి కూసిన దగ్గర్నుండి
చుక్క మెరిసే వరకూ
సూదిని నాట్యం చేయిస్తుంది కుప్పలకొద్దీ కుట్టేస్తుంది
అయినా దారిద్ర్యానికి దాక్షిణ్యం లేదు
అందుకే ఆమెకు గుండె మెదడూ రెండూ లేవు
ఎందుకంటే...? బీదవారి గుండెలు, కన్నీటి కడవలు
బీదవారి మెదడులు అశాంతి అడవులు
బీదవారి శరీరాలు ఎండి రాలిన ఆకులు
ఓ భాగ్యవంతుల్లారా! ఈ నిర్భాగ్యుల అవస్థ చూడండి
మీరు ధరించేవి పట్టుపురుగుల పట్టు వస్త్రాలు కావు
ఈ గతిలేని మానవుల వెకిలి శరీరాలు... చావైనా రాదు పాపం!
అయినా మీ చేతుల్లో చచ్చిన ఈ శవాలకు మళ్లీ చావేమిటీ?
వీళ్ల రక్తమూ, మాంసము అంత అగ్గువగా ఉన్నాయా?
వాళ్ల కన్నీళ్ల వేన్నీళ్లు మీ కళ్లకు కనిపించడం లేదా?

కుట్టడమేనా కుట్టడమేనా కలలో కూడా కుట్టడమేనా?
గుండె ఆగే వరకు, మెదడు చచ్చేవరకూ
ఎండకు, వానకు, చలికి బలియై కుట్టడమేనా?
షరాబుల బట్టలు కుట్టినా శరీరం నిండా బట్ట ఖరీదు చెయ్యలేదు
ధగధగ బట్టలు కుట్టినా భగభగ ఆకలి తీరదు
హూ... కరడు కట్టిన మెదడుక కమ్మటి ఆలోచనలా?
కన్నీటి కనులకు పన్నీటి కలలా?
భారమైన హృదయం ఇతరులను ప్రేమించడమా?
ఓ భాగ్యవంతులారా! ఈ నిర్భాగ్యుల అవస్థ చూడండి
తీర్చే మార్గం వెతకండి
మీరీ నిర్భాగ్యుల శరీరాలు తొడుక్కుని నలిపి నులిపి
వారి గుండెలు పిండుతున్నారని, పిసుకుతున్నారని మరవకండి!
తీర్చే మార్గం వెతకండి
అయినా ముఖమల్ పరుపుల్లో
ముఖాలు దాచుకునే మీకు
ఈ బీద ముఖాల్లో బాధ ఎలా తెలుస్తుంది?

**కవిత్వమ్**

# చీకటి కిరణాలు



ఈ దీపాల తోరణాలు
వెలగలేక వెలుగుతున్నాయి
ఏడవాల్సింది - మరి నవ్వుతున్నాయ్
సగం వేళ్లు ఊడిపోయిన
కుష్టురోగిని జ్ఞప్తికి తెస్తున్నాయి
చలి ఎదురు తిరుగుతుంది
దీపం ఆరిపోతూ వెలుగుతుంది
శ్రీకృష్ణులెప్పుడో మూర్ఛపోయారు
సత్యభామలో సత్తా లేదు

నరకాసురులు మీసం మెలేస్తున్నవేళ
రక్తం చమురవుతున్న హోమం ఇది-
కళ్లలో కుళ్లు వెలుగుతుంది
గుండెల్లో ద్వేషం వళ్లు పెంచుకుంది
అసహనం తనలో ఆకళ్ల జిలుగు దించుకుంది
స్వార్థం వెలుగును ప్రపంచం పంచుకుంటోంది
అన్ని వైపులా చీకటి కిరణాలు
ప్రసరిస్తున్నాయ్ - అవును
ప్రసరిస్తున్నాయ్!!

**- డా॥ దేవరాజు మహారాజు**

# వృథార్ధ జీవితాలు

గుడిసెలో...
ముసిల్దాని గొంతు మూలుగులతో మూగబోయింది
చిరిగిన గుడ్డ కూడా లేదు ఒంటిపై కప్పకోను
కుక్కిమంచంలో బక్కపీనుగులా బిక్కుమంటోంది
మూగిన ఈగలను తోలేశక్తి ఒడిగట్టింది
తోడున్న ముసలోడు పీక్కుపోయిన కళ్లకు
చూపాననుకుంది
తనపై ముసిరే దోమల దాడిని నిరోధించలేకున్నాడు
కాలే కడుపుకు చద్ది కూడు కాదు కదా
కనీసం గంజినీళ్లూ కరువైపోయాయి
అడుక్కునే శక్తి ఏనాడో హరించుకుపోయింది
వాళ్లు అస్తిపంజరాల్లాగా మిగిలిపోయారు
తమ కన్నా శవాలే నయమనుకుంటున్నారు
వాళ్లనుకోవడమేంటి - వాళ్లు ప్రాణమున్న పీనగులే
కొడుకు....
కూలి దొరకక కాసుల్లేక
కాలే కడుపుకు కప్పం కట్టలేక
ఆకలి మంటకు అల్లాడిపోతూ
దిగులు పడుతూ దిగాలవుతూ

గమ్యం తెలియక లక్ష్యం లేక
రోడ్లవెంట తిరుగాడుతున్నాడు

తన పరిస్థితికి చీదరించుకుని తనను వదిలేసి
ఎప్పుడో వెళ్లిపోయిన ఆలుబిడ్డల తలచి విలపించాడు
గుడిసెలో ఉన్న అమ్మ అయ్యల దుస్థితిని తలపోశాడు
ఈ జన్మకు సుఖం లేదు బతుకంతా
బాధాతప్తమైపోయింది
తన బతుకు గజ్జికుక్క కన్నా హీనమైపోయిందని
వాపోతూ
చీడపట్టిపోయిన తన వ్యాథార్థ జీవితాన్ని
అంతం చేసుకుని బాధానివృత్తి చేసుకోవాలని
నూతిని, గోతిని, కాలువను వెతుక్కుంటూ వెళ్లి
మరుజన్మనైనా మంచిగా మనగల్గేలా చూడమని
దేవుని వేడుకుని కాల్వలో దూకాడు ఆ అభాగ్యుడు
ఈ ఈతి బాధలు వెతలు ఈ ఒక్క కుటుంబానివేనా?
కాదు కాదు చరిత్ర పుటలకెక్కని ఇలాంటి
వృధార్తులెందరో

**- గాజుల వెంకటేశ్వరరావు**

# అగ్ని సాక్షిగా



వ్యాకరణంలో గెలుపు ఓటమి
జంటపదాలుగా నిలుస్తాయి
పోరాటం మస్తిష్కంలో మొలక
చీకటి కోణంలో దీపిక!
ఆక్రోశిస్తూ కూర్చున్న వాడిని
దైవంపై భారం మోపిన వాడిని
కథ కంచికి పంపుతుంది!
దాహం నీటిని వెతుక్కుని
దోసిట్లో నింపి
పెదాలు స్పృశించేలోగా
కాళ్లను నీళ్లు లాగేస్తాయని కలగంటామా
ప్రాణం తోడేస్తుందని భ్రమగంటామా
నీటిని ఓడించి వొడ్డుకు చేరితే
ఓడిన నీరు ఉక్రోషంతో
ఒడ్డుకు తల బాదుకుంటుంది!
ఆకలి సేకరించిన నూకలు
నీడన చేరి అగ్గిపుల్ల సాయం కోరితే
పొయ్యిలో వెలగాల్సిన పుల్లలు
చూరులో రగిలితే
తోకను కత్తిరించిన అగ్నిని
పొయ్యికి పరిమితం చేస్తే
ఓడిన అగ్ని వీరావేశంతో
పొయ్యిలో ప్రచండమౌతుంది!
ఊపిరి సలపని సమస్యల్తో
ఉక్కిరి బిక్కిరైన శరీరం
పైరగాలిని కోరితే
విషం కలిసిన వాయువు
ముప్పు మోసుకువస్తే
ప్రమత్తతతో ప్రాణం
విషాన్ని ఓడించి విజయం సాధిస్తే
ఓడిన వాయువు నిర్లిక్తమౌతుంది!
ప్రాణం పోసే ప్రాణం
ప్రాణం తీస్తుంటే
ప్రాణం పోసుకున్న ప్రాణం
ప్రాణం తీస్తుంది!
మజిలీకి గవేషణ వీడ్కోలు
గవేషణకు గమ్యం ఆహ్వానం!

**- అడిగోపుల వెంకటరత్నమ్**

# ఎప్పటికి మారేను!?



ఇప్పుడు నాకు ఏభైఏళ్లు నిండాయి
ఊహ తెలిసినప్పట్నుండి
ఉన్న మా ఊరి సమస్యలు
సర్వే రాళ్లలా తిష్ట వేసుకుని
మాతో సరసాలాడుతున్నాయి
మా గూడెం గుడిసెల కాపురాలు
గజం దూరం కూడా జరగలేదు
చాలీచాలని కొంపల్లో
ఎండకు ఎండి, వానకు తడిసి
మా శరీరాలు చలికి గజగజ
వణుకుతూనే ఉన్నాయి
ఐదు దశాబ్దాలుగా మా ఊరికొస్తున్న
అయ్యవార్లు మా పిల్లలకు
నాలుగక్షరాలు నేర్పించలేకపోవటంతో
ఏదో చదివి ఉద్యోగాలెలగబెట్టి
ఉద్ధరిస్తారనుకున్న మా పిల్లకాయలు
మాతోపాటు పొలంలో మట్టి పిసుకుతూ
మా ముందు మొండిగోడలుగా మిగిలిపోతున్నారు
మా ఊరిపొలిమేరల నుండి
మన్ను తిన్న తాచుపాములా పడిఉన్న మట్టిరోడ్డు
తారురోడ్డుగా మారుతుందనుకున్న
మా కలలన్నీ కల్లలుగానే ఉండిపోయాయి
ఏభై ఏళ్లనుండి పీలుస్తున్న ఆ రోడ్డు దుమ్ముతో
మా ముక్కులు, డొక్కలు నిండిపోయాయి
మా అమ్మమ్మలు, తాతయ్యలు రోగిస్టులుగా మారి
రొప్పుతూ రోజులు గడుపుతున్నారు
కనీసం కరెంటు తీగలైనా మా ఊరివైపు
వస్తాయని ఎదురుచూస్తున్న మాకు
అవి అందని ద్రాక్షగానే మిగిలిపోయాయి
పట్టణాల్లో తారు రోడ్లపై వేస్తున్న సిమెంటు రోడ్లు
ట్యూబులైట్ల స్థానంలో వస్తున్న మెర్క్యురీ లైట్లు
మా చీకటి బతుకుల్ని వెక్కిరిస్తూనే ఉన్నాయి
ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల జాతరలో
మేం ఎన్నుకున్న మా రాజులు
మమ్మల్నెప్పటికైనా కరుణించకపోతారా
మా తలరాతలు మారకపోతాయా అని
కళ్లలో వత్తులేసుకుని చూస్తుంటే
ఆ వత్తులకు మా కళ్లు
మాడి మసైపోతున్నాయే తప్ప
మా చితికిన బతుకుల చితిమంటలు
ఆరడం లేదు
తరతరాల మా తలరాతలెప్పటికీ
మారడం లేదు

**- డా॥ వి. రాజేంద్రప్రసాద్**

కొత్తగా వచ్చిన ఏ విజ్ఞానాభివృద్ధి అయినా జనంలో ప్రాచుర్యం పొందాలంటే, దాన్ని ముందుగా విస్తృత వ్యాప్తిలోకి తీసుకువచ్చే ద్రష్టలు అవసరం. ఆ దిశలో అనేకులు పయనించడానికి దోవ చేసి, దారి చూపే మార్గదర్శకులు అత్యవసరం. ఇరవయ్యో శతాబ్దపు అత్యద్భుత వైజ్ఞానిక ఆవిష్కరణల్లో ఒకటైన చలనచిత్ర కళకు సైతం అలా మనదేశంలో పాదులు తీసి, ప్రాచుర్యంలోకి తెచ్చిన పితామహులు, మార్గదర్శకులుగా దాదాసాహెబ్ ఫాల్కే, ఆర్.జి. టోర్నే లాంటి పెద్దల పేర్లను మనం స్మరించుకుంటూ ఉంటాం. కానీ, వాళ్ళందరి కన్నా ముందే, 1909 నాటికే చలనచిత్ర రంగంలో దిగిన తెలుగు వాడు - రఘుపతి వెంకయ్య. వాళ్ళ కన్నా ముందే మన గడ్డ మీద సినీ పరిశ్రమకు ప్రాణప్రతిష్ఠ చేశాడాయన. సినీ రంగంలో అత్యంత కీలకమైన చిత్ర ప్రదర్శన, చిత్ర నిర్మాణం, చిత్ర నిర్మాణశాల (స్టూడియో) స్థాపన శాఖలు మూడింటిలోనూ తెలుగు వారికి పితామహుడయ్యారు.

- రెంటాల జూనియర్

# తెలుగు వారి సినీ కళకు తొలి మార్గదర్శి రఘుపతి వెంకయ్య



రఘుపతి వెంకయ్య నాయుడు

**1869** (కొందరు 1873 అంటారు) అక్టోబర్ 15న మచిలీపట్నంలోని గౌరవనీయమైన సైనిక కుటుంబంలో రఘుపతి వెంకయ్య నాయుడు జన్మించారు. ఆయన తల్లితండ్రులు శేషమాంబ, సుబేదార్ అప్పయ్య నాయుడు. ప్రముఖ విద్యావేత్త, సంఘసంస్కర్త, మద్రాసు విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ అయిన సర్ రఘుపతి వెంకట రత్నం నాయుడు గారికి వెంకయ్య స్వయానా తమ్ముడు.

### ఫోటోగ్రఫీతో ఆరంభం

చిన్నప్పటి నుంచి కళారాధకుడైన రఘుపతి వెంకయ్య చిత్రలేఖనం, శిల్పకళలో ప్రావీణ్యం సంపాదించారు. కౌమార దశలోనే మద్రాసుకు చేరుకున్న ఆయన మొదట ఓ చిన్న కళాకేంద్రాన్ని ఏర్పాటుచేశారు. అచిరకాలంలోనే ఫోటోగ్రఫీలో నిపుణుడిగా ఎదిగారు. ఆ తరువాత ఆయన స్వయంగా ఫోటో స్టూడియో పెట్టారు. మద్రాసు రాష్ట్రంలోని రాజాలు, జమీందారులు వెంకయ్యకు ఎంతో ప్రోత్సాహం ఇస్తుండేవారు. ఆనాటి గవర్నర్ కూడా ఆయన పట్ల ఎంతో అభిమానం చూపెట్టేవారు. అప్పట్లో తలకు పాగా చుట్టుకొని, రఘుపతి వెంకయ్య తన గుఱ్ఱపు బగ్గీ మీద మౌంట్‌రోడ్డులో వస్తూ ఉంటే, అందరూ ఆయనను ఓ మహారాజులా చూసేవారట! చిత్రలేఖనంలో కూడా వెంకయ్య దిట్ట. ఫోటోలు తీయడమే కాక, తైలవర్ణ చిత్రాలను కూడా గీసేవారు. అలా ఎందరో మహారాజుల చిత్రపటాలను ఆయన చిత్రించారు. చిత్రలేఖనంలో చూపిన ప్రతిభకు గుర్తింపుగా, ఆయనకు ఎన్నో సువర్ణ పతకాలు లభించాయట!

కొత్త ఆలోచనలు, సరికొత్త ప్రయోగాలంటే రఘుపతి వెంకయ్యకు మొదటి నుంచి ఆసక్తి. ఆయనలో వ్యాపారదక్షత కూడా ఎక్కువే! దాంతో, వ్యాపారంలో ధైర్యంగా సాహసోపేత ప్రయత్నాలు చేసేవారాయన. ఒకరోజు ఆయన దృష్టి వార్తాపత్రికలోని ఓ వార్త మీద పడింది. 'క్రోనో మెగాఫోన్' అనే పేరుతో ఓ సినిమాటోగ్రాఫిక్ ఎక్విప్‌మెంట్‌ను కనిపెట్టారనీ, చలనచిత్రాన్ని తెర మీద ప్రదర్శిస్తున్న సమయంలోనే రికార్డెడ్ డిస్కు సాయంతో ఆ యంత్రం ద్వారా శబ్దం వెలువడుతుందనీ ఆ వార్త సారాంశం. లండన్‌లోని గోమాంట్ సంస్థ అధినేతలు ఈ యంత్రసాధనాన్ని తయారు చేశారు. బకింగ్‌హామ్ రాజభవనంలో అయిదో జార్జి ప్రభువు, మేరీ రాణి సమక్షంలో వారు ఈ సాధనంతో తొలి ప్రదర్శన ఇచ్చారనీ, ప్రదర్శన ఎంతో సంతృప్తికరంగా సాగిందనీ ఆ వార్తలో పేర్కొన్నారు. ఆ వార్త చదవగానే రఘుపతి వెంకయ్యలో ఆసక్తి పెరిగింది.

### తాకట్టు డబ్బుతో సినిమా ప్రయోగం

ఇదంతా 1908 నాటి మాట! ఎప్పటికప్పుడు కొత్త పుంతలు తొక్కడానికి ఇష్టపడే వెంకయ్య వెంటనే మద్రాసులోని జాన్ డికిన్సన్ అండ్ కంపెనీ వారిని కలుసుకొని, 'క్రోనో మెగాఫోన్' యంత్ర సాధనం కోసం ఆర్డరు పెట్టాడు. అలా 1908లో ఆయన ఫ్రాన్స్‌లోని గోమాంట్ అండ్ కంపెనీ నుంచి క్రోనో మెగాఫోన్ (మాట్లాడుతూ, పాటలు పాడే) యంత్రాన్ని మద్రాసుకు దిగుమతి చేసుకున్నారు. అందు కోసం ఆ రోజుల్లోనే ఏకంగా రూ. 40 వేలు ఖర్చుపెట్టారు. ఏకంగా తన ఫోటో స్టూడియోను తాకట్టు పెట్టి, డబ్బు తీసుకొచ్చి, ఆ యంత్రాన్ని కొన్నారు.

భారతదేశంలో అంతకు మునుపెన్నడూ కనీవినీ ఎరుగని యంత్రం అది. అది ఎలా పని చేస్తుందా అన్న అనుమానాలు వెంకయ్యకు లేకపోలేదు. ఆ యంత్రాన్ని తెప్పించి, పని చేయించి చూసే దాకా ఆయన కూడా ఉద్విగ్నంగానే గడిపారు. ఆ యంత్రంతో ఆయన మొట్టమొదటగా మద్రాసులోని విక్టోరియా పబ్లిక్ హాలులో ప్రదర్శన ఏర్పాటు చేశారు. (మద్రాసులోని నగరపాలక సంస్థ కార్యాలయం 'రిప్పన్ బిల్డింగ్స్'కు పక్కగా ఇటీవలి దాకా ఉన్న వి.పి. హాలు ఇదే). మూడు నాలుగు వందల అడుగుల పొడవున్న పన్నెండు 'షార్ట్ రీలర్స్'ను ఆనాటి కార్యక్రమంలో ప్రదర్శించారు. ఓ పక్కన తెరపై బొమ్మ కనిపించడం మొదలు కాగానే, మరో పక్క రికార్డు కూడా స్విచ్ ఆన్ అయ్యేది. దాంతో, శబ్దం ఉత్పన్నమై, బొమ్మతో పాటు పాట వినిపించేది.

సంతృప్తికరమైన వసూళ్ళు రాకపోయినప్పటికీ, ఈ మొదటి చలనచిత్ర ప్రదర్శన విజయవంతమయ్యేసరికి వెంకయ్య ఉత్సాహం తెచ్చుకున్నారు. ఆ పైన ఫిల్ముల


ఆర్. ప్రకాశ్


విక్టోరియా పబ్లిక్ హాల్


'గెయిటీ' థియేటర్

రాక్సీ థియేటర్

ప్రదర్శన కోసం 1910లో మద్రాసులోని ఎస్ప్లనేడు ప్రాంతంలో డేరా సినిమాహాలు నెలకొల్పారు. క్రమంగా ఈ చిత్ర ప్రదర్శనల పట్ల ప్రజలు ఆకర్షితులయ్యారు. ఆ పైన రఘుపతి వెంకయ్య తన డేరా సినిమా తీసుకొని, మద్రాసు ప్రెసిడెన్సీ (అప్పట్లో తెలుగునాడులో అత్యధిక భాగం మద్రాసు ప్రెసిడెన్సీలో భాగమే) అంతటా పర్యటించారు. అలా ఆంధ్రదేశంలోని పట్టణాల్లోనూ, బెంగుళూరులోనూ చిత్ర ప్రదర్శనలు నిర్వహించారు. అలాగే, సింహళ దేశంలోనూ, బర్మాలోనూ పర్యటనలు జరిపారు. అలా ఆ యంత్రంతో చలనచిత్ర ప్రదర్శనలు ఇచ్చేసరికి ఊరూరా సంచలనం రేగింది. ఆయన అపారంగా డబ్బు సంపాదించగలిగారు.

**మద్రాసులో మొదటి పర్మనెంట్ హాలు వెంకయ్యదే!**

మద్రాసులో శాశ్వత ప్రాతిపదికన సినిమా థియేటర్లు కట్టిన తొలి భారతీయుడు ఆయనే! మద్రాసులో మౌంట్ రోడ్డు నుంచి పక్కకు దారి తీసే వ్యానెల్స్ రోడ్డులో హ్యారిస్ బ్రిడ్జ్‌కు సమీపంలో 1913లో ఆయన సినిమా థియేటర్ కట్టారు. అదే – 'గెయిటీ' థియేటర్. (మద్రాసులో భారతీయులు నిర్మించిన తొలి పర్మనెంట్ సినిమా హాలు అదే. ఆ సినిమా హాలు ఇటీవలే 2009 ద్వితీయార్ధంలో కూల్చివేతకు గురైంది). 'గెయిటీ' తరువాత మద్రాసులోనే మింట్ స్ట్రీట్‌లో 'క్రౌన్' థియేటర్ కట్టారు. అటుపైన ముచ్చటగా మూడో సినిమా హాలుగా మద్రాసులోని పరశువాక్కమ్‌లో 'గ్లోబ్ థియేటర్ నిర్మించారు. (యూరోపియన్ శైలి వాస్తు నిర్మాణమైన ఈ 'గ్లోబ్' థియేటర్ పేరే ఆ తరువాత 'రాక్సీ'గా మారింది. గడచిన నాలుగైదేళ్ళ కాలంలోనే ముందుగా 'క్రౌన్', ఈ మధ్యనే 'రాక్సీ', తాజాగా 'గెయిటీ' థియేటర్లు కూల్చివేతకు గురై, అత్యాధునిక షాపింగ్ కాంప్లెక్స్‌లుగా మారే క్రమంలో ఉన్నాయి). అలాగే, మధురైలో 'ఇంపీరియల్' సినిమా హాలు కూడా ఆ రోజుల్లో వెంకయ్య కట్టించినదే!

**విదేశాల్లో శిక్షణ పొందిన తొలి దక్షిణ భారతీయుడు**

చలనచిత్రాల ప్రదర్శన రంగంలోనే కాక మరో విషయంలో కూడా రఘుపతి వెంకయ్యే అభ్యుదయ పథగామి. చలనచిత్ర సాంకేతిక కళలో శిక్షణ కోసం ఆయన, తన కుమారుడు రఘుపతి సూర్య ప్రకాశరావు (తదనంతర కాలంలో దర్శక – నిర్మాత ఆర్.ఎస్. ప్రకాశ్‌గా, ఆర్. ప్రకాశ్‌గా సుప్రసిద్ధులు)ను విదేశాలకు పంపారు. అలా ఫిల్మ్ టెక్నిక్‌లో శిక్షణ కోసం తన వారసుణ్ణి విదేశాలకు పంపిన తొలి దక్షిణ భారతీయుడు కూడా రఘుపతి వెంకయ్యే! ఇంగ్లండ్‌కు వెళ్ళిన ఆర్. ప్రకాశ్ అక్కడ ఛాయాగ్రహణం నుంచి దర్శకత్వం దాకా పరిశ్రమలోని అన్ని రంగాల్లో ప్రత్యేక నైపుణ్యం సంపాదించారు. అలా ఆయన లండన్‌లో దాదాపు ఓ ఏడాది పాటు కాలం గడిపారు.

**తెలుగువారి తొలి స్టూడియో, తొలి మూకీలు**

ప్రకాశ్ ఇంగ్లండ్ నుంచి తిరిగి వచ్చిన తరువాత రఘుపతి వారి కుటుంబం మద్రాసులో పరశు వాక్కమ్‌లోని గ్లోబ్ థియేటర్ వెనక ఓ అధునాతన స్టూడియో నెలకొల్పింది. ఆ రోజుల్లో భారతదేశం మొత్తం మీద అత్యాధునిక స్టూడియో అదొక్కటే అని రఘుపతి ప్రకాశ్ పేర్కొన్నారు. చిత్ర నిర్మాణం కోసం 'స్టార్ ఆఫ్ ది ఈస్ట్ ఫిలిమ్స్' అన్న సంస్థను రఘుపతి వెంకయ్య, ఆర్. ప్రకాశ్ స్థాపించారు. దాని యాజమాన్యంలోదే ఈ స్టూడియో! ఆ స్టూడియోకు గాజు పైకప్పులుండేవి. దాంతో స్టూడియో లోపల చిత్ర షూటింగ్‌కు తగిన సూర్యకాంతి అందుబాటులో ఉండేది. ఈ గాజు పైకప్పుల మూలంగా ఆ రోజుల్లో ఈ స్టూడియో 'గ్లాస్ స్టూడియో'గా ప్రాచుర్యం పొందింది. ఇంగ్లండ్‌లోని ఆధునిక స్టూడియోల లాగానే ఈ స్టూడియోలో లేబరేటరీలతో సహా సమస్తం ఉండేవి. ఈ స్టూడియో ఏర్పాటుకు అప్పట్లోనే దాదాపు లక్ష రూపాయలు ఖర్చయింది!

కుమారుడు ఆర్. ప్రకాశ్ దర్శకత్వంలో రఘుపతి వెంకయ్య 'భీష్మ ప్రతిజ్ఞ', 'గజేంద్ర మోక్ష', 'భక్త నందన్', 'సముద్ర మథనం' అనే నాలుగు చిత్రాలు నిర్మించారు. ఈ శబ్దరహిత చిత్రాలన్నీ ఆ 'గ్లాస్ స్టూడియో'లో నిర్మాణమైనవే! 1928కి ముందే ఆ రోజుల్లో రఘుపతి వారి సంస్థ నుంచి కొన్ని టాపికల్ చిత్రాలు కూడా నిర్మాణమయ్యాయి. మొత్తం మీద రఘుపతి వెంకయ్య, ఆర్. ప్రకాశ్‌ల స్టూడియో దాదాపు నాలుగైదేళ్ళు బాగా నడిచింది. అయితే, తగినంత మూలధనం కానీ, ప్రోత్సాహం కానీ లేకపోవడంతో వారు ఎంతో కాలం స్టూడియోను నడపలేకపోయారు. దాంతో, 1924 – '25 ప్రాంతంలో వారి చిత్ర నిర్మాణ వ్యాపారం కుప్పకూలింది. స్టూడియో మూతపడింది.

**ఆఖరులో అష్టకష్టాలు**

బాకీ పడ్డ డబ్బును వసూలు చేయడం కోసం ప్రభుత్వ అధికారులు వచ్చి, స్టూడియోలోని గాజు పైకప్పులతో సహా ఎంతో సామగ్రిని విక్రయించారు. నష్టాలలో కూరుకుపోయిన ఆయన చివరకు సినిమా వ్యాపార ఆలోచనలకు స్వస్తి చెప్పి, తనకు ఎంతో ఇష్టమైన పాత వ్యాపకం ఫోటోగ్రఫీకే మరలిపోవాల్సి వచ్చింది. ఆయన వారసుడైన ఆర్. ప్రకాశ్ మాత్రం చిత్ర నిర్మాణ, దర్శక విభాగాల్లో కొనసాగారు.

సినిమా రంగం నుంచి బయటకు వచ్చేసిన తరువాత కూడా పన్నెండేళ్ళ పాటు తెలుగు చిత్ర పరిశ్రమ అభివృద్ధిని కళ్ళారా చూసిన రఘుపతి వెంకయ్య ఆ తరువాత వ్యాధిగ్రస్తుడై, 1941 మార్చి 15న కన్నుమూశారు. అంతటి మహనుభావుడి మరణం గురించి ఎవరూ పత్రికల్లో రాసినట్లు కనబడదు. అందరూ మర్చిపోయిన రఘుపతి వెంకయ్య స్మారకార్థం ఒక అవార్డును ప్రవేశపెట్టాల్సిందిగా ఇంటూరి లాంటి పెద్దలు 'దక్షిణ భారత సినీ సాంకేతిక నిపుణుల సంఘం' లాంటి సంస్థల ద్వారా మన రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, ఎట్టకేలకు విజయం సాధించారు. జాతీయ స్థాయిలో దాదాసాహెబ్ ఫాల్కే అవార్డులాగా, మన రాష్ట్ర స్థాయిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సినీ రంగానికి విశిష్ట సేవలందించిన వారికి 1981 నుంచి ప్రతిష్ఠాత్మక రఘుపతి వెంకయ్య అవార్డును అందిస్తోంది. గత ఏడాది జనవరిలో హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్ కూడలిలో రఘుపతి వెంకయ్య విగ్రహాన్ని కూడా నెలకొల్పారు. చలనచిత్ర వ్యాపారంలో ఉన్న వారందరికీ రఘుపతి వెంకయ్య జీవితం ఓ పెద్దబాలశిక్ష. ★

కొత్త పుస్తకాలు

# అద్దంలో చందమామ

శ్రీశ్రీ... ఈ పేరు వినగానే నరనరాల్లో ఓ ఉత్తేజం, ఓ ఉత్సాహం. తెలుగు సాహిత్యంలో ఆయనదో 'మహాప్రస్థానం'. ఎంత విన్నా, మరెంత చదివినా ఆ మహనీయుని జ్ఞాపకాలు 'అనంతం'. శ్రీశ్రీ ఒక మహోన్నత శక్తి. ఉద్యమ స్ఫూర్తి. నాటికీ, ఈనాటికీ సమాజంలో జరుగుతున్న పరిణామాలకు అన్వయించుకునే రచనలు ఆయనవి. అవి పదాలు కావు, పదునెక్కిన చురకత్తులు. వాడి వేడి అగ్నిగోళాలు. అక్రమాలపై, అన్యాయాలపై, దోపిడిపై, పీడనపై ఎక్కుపెట్టిన బాణాలు. తిరుగుబాటు తూటాలు. అందుకే ఆయన రచనలు ఎప్పుడు చదివినా మనలో ఆవేశం పెల్లుబుకుతుంది. రచనలే కాదు, ఆయన భావాలు కూడా అలా ప్రేరణనిచ్చేవే! మనల్ని సమకాలీన సమస్యలపై పోరాడేలా సమాయత్తం చేసేవే! నిజానికి ఆయన గురించి రాయడమంటే అద్దంలో చందమామను చూపినట్లే.

శ్రీశ్రీ సంసారప్రస్థానం చూడగానే, ఆ ఉత్తుంగ తరంగం గురించి మరెన్నో విషయాలు, విశేషాలు తెలుసుకోవాలని అనిపిస్తుంది. పైగా దీన్ని రచించింది ఆయన జీవిత సహచరిణి సరోజ. అంటే ఆయనను అత్యంత సమీపంగా చూసి, వాటికి తన అనుభూతులను కలబోసి అక్షరబద్ధం చేసిన అనుభవాలు. అందుకు తగ్గట్టుగానే శ్రీశ్రీ తాలూకు అనేక సంఘటనలు, విషయాలు ఇందులో తెలుస్తాయి. ముఖ్యంగా శ్రీశ్రీ సినీప్రస్థానంలో జరిగిన సంఘటనలు... ఆయన మెతక ధోరణి, ఆమె నిర్మొహమాటంగా వ్యవహరించి నెట్టుకొచ్చిన తీరు తెలుస్తాయి. ఆయన పని రాక్షసుడన్న విషయం అర్థమవుతుంది. అందుకు ఆమె సహకారం నిండుగా ఉండేదన్న విషయమూ ద్యోతకమవుతుంది. పిల్లలపట్ల శ్రీశ్రీకుండే ఆపేక్ష, తన పిల్లలు మంచి చదువులు చదువుకోవాలనే ఆయన తపనలాంటి విషయాలన్నీ ఈ పుస్తకం ద్వారా తెలుస్తాయి. కాకుంటే ఇందులోని అనేక విషయాలు 'అనంతం'లో చదివినవే. ఆ నోటా ఈ నోటా విన్నవే! అయినా ఒకసారి శ్రీశ్రీని మననం చేసుకోవాలంటే ఈ పుస్తకం చదవొచ్చు.

**శ్రీశ్రీ సంసార ప్రస్థానం, రచన: సరోజా శ్రీశ్రీ, వెల: 200/-, పేజీలు: 426, ప్రతులకు: విశాలాంధ్ర బుక్‌హౌస్.**

**- కె.అరుణ**

# వాస్తవ గాథలు

ప్రముఖ రచయిత్రి, అనువాదకురాలు డా॥ జె.భాగ్యలక్ష్మి 'ఇంద్రధనస్సు' అంటూ ఈ కథా సంపుటికి ముందుమాట రాశారు. పాఠకుడు, రచయిత ఒకే తరంగాంతరంలో రాగలిగితేనే ఆ రచన సార్థకమవుతుంది. మానవ సంబంధాలు, మానవత్వం, సరళత, సహజంగా ఉండడం చెప్పదలచుకున్న దాన్ని సూటిగా చెప్పడం శ్రీపాద స్వాతి గారి కలంలోని ప్రత్యేకత. దాదాపు 26 కథలున్న ఈ కథా సంపుటిలోని అన్ని కథల్లోను ఏక బిగిన చదివించే గుణం ఉంది. తీరిన బెంగ, నేను సైతం, మౌనంగానే... రాజీ - మార్పు, అంచనా, ఎర, గోడలు, చీకటి గుహ (విషయసూచికలో చీటిక గుహ అన్నారు), మనసున్న మనిషి ... కథలు చాలా బాగున్నాయి. ఇతర భాషల్లోని అనువాదం చెయ్యాల్సిన మంచి కథలు. 'గోడలు' కథ హృదయాన్ని ద్రవింపజేసే అద్భుతమైన కథ. ప్రతి తల్లీ కూతుళ్లు తమ... తమ... అంతరంగ తరంగాల్ని తడిమి చూసుకోవాల్సిన అద్భుతమైన కథ. తల్లిప్రేమ  ఎంత గొప్పగా ఉంటుందో తెలిపే కథ ఇది (ఈ సంపుటికి ఈ టైటిల్ పెట్టారు). "భేషజాలు వదలి అమ్మ అక్కున చేరాను. అమ్మ నిశ్శబ్దం కూడా మాటల్లాగే వినిపించింది నాకు. ఇరుకైన గోడలు ఎంతో విశాలంగా తోచాయి. అమ్మ నిశ్శబ్దాన్ని అనువదించుకుంటే (పేజీ22)" ఇలాంటి బరువైన సన్నివేశాలతో కథ సాగుతుంది. నేటి సమాజంలో చాలామంది పురుషుల మనస్తత్వాల్ని "తీరిన బెంగ' కథలో రచయిత్రి చక్కగా రాశారు. పన్నెండేళ్ల మాధవి (పనిమనిషి) పై ఇంటి యజమాని స్త్రీ వాంఛ... పువ్వులిస్తూ వెకిలి చేష్టలు.. బాల్యం నుండి నేటి దాకా పురుషుల మనస్తత్వాలతో పడిన ఇబ్బందులు... మాధవ్ భార్యలో మెదలడం.. ఓ రోజు తెలివిగా ఇంటి ఓనర్‌తో మాట్లాడ్డం కథకు చక్కటి ముగింపు. "పులి తోలు కప్పుకున్న నక్కల నుండి ఎంతకాలం ఇలా పారిపోవడం? దీనికో పరిష్కారం లేదా? (పేజీ171)" వల్లీశ్వర్ అన్నట్లుగా 'వాస్తవానికి దగ్గరగా యువతులు ఎదుర్కొనే సమస్యలకి, మానసిక సంఘర్షణలకి రచయిత్రి తన పాత్రల ద్వారా పరిష్కారం చూపించే ప్రయత్నం ఈ కథల్లో కనిపించింది. ఓ మంచి కథా సంపుటి చదివామన్న భావం పాఠకుల్లో కలిగించిన కవయిత్రి అభినందనీయురాలు.

**గోడలు - శ్రీపాద స్వాతి (కథా సంపుటి), పేజీలు : 171, వెల : 100/-, ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్, నవోదయా బుక్‌హౌస్.**

**- తంగిరాల చక్రవర్తి**




**జస్టిస్ శ్రీ కృష్ణ నివేదిక**
**ఏం చెప్పింది?**
**ఎందుకు చెప్పింది?**
డా॥ జి.వి. పూర్ణచందు
పేజీలు : 135, వెల : 40/-,
ప్రతులకు : శ్రీ వెంకటేశ్వరా బుక్ డిపో, ప్లాట్‌నెం.3,103, # 2-4-1085, సాయి లక్ష్మీనికేతన్, రామకృష్ణ హాస్పిటల్ ఎదురు, కాచిగూడ కుమార్ థియేటర్ దగ్గర, నింబోలి అడ్డా, హైదరాబాద్- 27.

నిశ్శబ్ద సంకేతం
వారాల కృష్ణమూర్తి
పేజీలు : 160, వెల : 80/-,
ప్రతులకు : వారాల కృష్ణమూర్తి ప్లాట్ నెం.657, శ్రీకృష్ణదేవరాయ నగర్, వనస్థలిపురం, హైదరాబాద్-70. మరియు విశాలాంధ్ర అన్ని బ్రాంచీల్లో, నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ మందిర్ ఎదురుగా, కాచిగూడా, హైదరాబాద్.



చూద్దామా



నిండు పౌర్ణమి రోజు సముద్రం ఒడ్డున కూర్చుని వెన్నెలని ఆస్వాదిస్తుంటే ఎంత సమయం గడిచిపోయిందో తెలీదు. అంతటి అద్భుత అవకాశం ఉన్న ప్రదేశాల్లో గోవా ఒకటి. అసలు గోవా చూడాలంటే వర్షాకాలంలోనే చూడాలి. ఆ సమయంలోనే గోవా టూరిస్టులతో సందడిగా ఉంటుంది. బీచ్‌లన్నీ జనంతో నిండిపోయి ఉంటాయి. బీచ్ దగ్గర్లోనే బస ఏర్పాటు చేసుకుంటే సీ వ్యూ అద్భుతంగా ఉంటుంది.

# వావ్... గోవా...

పడమటి కనుమల్లో కొంకణి తీరాన ఉన్న గోవాకు 101 కిలోమీటర్ల సముద్ర తీరం ఉంది. వైశాల్యపరంగా దేశంలోనే అతి చిన్న రాష్ట్రమైన గోవా పర్యాటకులను ఆకర్షించడంలో ముందుంది. చక్కని బీచ్‌లు, ప్రత్యేకమైన కట్టడాలు, విశిష్టమైన వన సంపద ఇవన్నీ కలిపి గోవాను మంచి పర్యాటక కేంద్రాన్ని చేశాయి.

**చరిత్ర**

గోవా లేదా గోమాంటక్ అని పిలిచే ఈ రాష్ట్రానికి ఆ పేరు ఎలా వచ్చిందనే విషయంపై ఇప్పటికీ స్పష్టమైన ఆధారాలు లేవు. ఈ ప్రాంతానికి మహాభారతంలోనూ, ఇతర ప్రాచీన గ్రంథంలోనూ గోపరాష్ట్రం, గోవరాష్ట్రం, గోపకపురి, గోపక పట్టణం, గోమంచాల, గోవపురి వంటి పేర్లు ఉన్నాయి.

గోవా ప్రాంతాన్ని మౌర్యులు, శాతవాహనులు, దక్కన్ నవాబులు పాలించారు. 13వ శతాబ్దంలో ఇది ఢిల్లీ సుల్తానుల వశమైంది. 13వ శతాబ్దపు చివరిలో విజయనగర రాజు మొదటి హరిహర రాయలు గోవాను జయించారు. 14 వ శతాబ్దపు చివరిలో బహమనీ సుల్తానులు దీన్ని కైవసం చేసుకున్నారు.

16 వ శతాబ్దంలో పోర్చుగీసు వర్తకులు గోవాలో స్థావరం ఏర్పరచుకుని, కొద్ది కాలంలోనే అధికారాన్ని హస్తగతం చేసుకున్నారు. ఇక్కడే స్థిరపడి స్థానికులను పెళ్లి చేసుకున్నారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక కూడా పోర్చుగీసు వారు గోవాను వదులుకోడానికి ఒప్పుకోలేదు. 1961 డిసెంబర్ 12న భారతసైన్యం ప్రవేశించి గోవాను ఆక్రమించుకుంది.

ఇక్కడి ప్రజల తలసరి ఆదాయం భారతదేశంలోని ఇతర ప్రాంతాల్లో కంటే ఒకటిన్నర రెట్లు ఎక్కువగా ఉంది. దీనికి కారణం ఇక్కడి ఆర్థిక రంగం వృద్ధిచెందడమే. పర్యాటక రంగం గోవా ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉంది. భారతదేశానికి వచ్చే విదేశీ యాత్రికుల్లో 12 శాతం మంది గోవాను దర్శిస్తున్నారు.

గోవాలో మాండవి, జువారి, తెరెఖోల్, ఛపోరా, బేతుల్ అనే నదులు ప్రవహిస్తున్నాయి. జువారి నది ముఖద్వారాన ఉన్న మార్ముగోవా నౌకాశ్రయం సహజ నౌకాశ్రయం.

**రవాణా**

గోవాలో రెండు రైల్వే మార్గాలున్నాయి. ఒకటి స్వాతంత్ర్యానికి పూర్వం నిర్మించిన వాస్కోడిగామా - హుబ్లీ మార్గం. రెండోది 20 వ శతాబ్దంలో నిర్మించిన కొంకణ్ రైల్వే మార్గం.

ఇక్కడ సైకిళ్ల లాగే టూ వీలర్స్ కూడా అద్దెకిస్తారు. వీటికి అద్దె రోజుకు 400 పైనే వుంటుంది.

**ఆహారం**

వరన్నం, చేపల కూర ఇక్కడి ప్రధాన ఆహారం. కొబ్బరి, మసాలా దినుసులు, జీడిమామిడి, మిర్చి వంటి ద్రవ్యాలు వాడి తయారు చేసే రుచికరమైన వంటకాలు సందర్శకులను ఎంతగానో సంతృప్తపరుస్తాయి. జీడిమామిడి, కొబ్బరి కల్లు నుండి తయారు చేసిన 'ఫెన్నీ' అనే డ్రింక్ ఇక్కడి ప్రత్యేకత. సీ ఫుడ్ ఇష్టపడే వారికి గోవాను వదిలి రాబుద్ధి కాదు. అవకాశం వచ్చినప్పుడే కదా ఉపయోగించుకోవాలి. ఈ టూర్‌లో వున్నప్పుడే బోలెడన్ని రకాల వంటకాలు రుచి చూడొచ్చు.

**చూడాల్సిన ప్రదేశాలు**

గోవాలో చూడాల్సిన ప్రదేశాల్లో ఒకటి బిగ్‌ఫుట్. ఒకప్పుడు ఇక్కడ ఓ సాధువు ఒంటి కాలితో తపస్సు చేశాడట. ఆ ప్రదేశంలో నిల్చుని మనం ఏదైనా కోరుకుంటే నెరవేరుతుందని స్థానికుల నమ్మకం. అక్కడికి దగ్గర్లోనే శాంతాదుర్గా ఆలయం, మంగేశ్ ఆలయం ఉన్నాయి. మనం శివారాధకులు శివలింగాన్ని పూజించడమే చూస్తుంటాం. కానీ మంగేశ్ ఆలయంలో ఏకంగా శివుని విగ్రహానికే అర్చనలు చేస్తుంటారు. ప్రముఖ హిందీ గాయని లతా మంగేష్కర్ ఈ ఆలయాన్ని



సెయింట్ జేవియర్ చర్చి



జేవియర్ మమ్మీ

బిగ్‌ఫుట్



మార్ముగోవా నౌకాశ్రయం

పునరుద్ధరించారట.

గోవాలో చర్చిలు ఎక్కువగా ఉంటాయి. వాటిలో ముఖ్యంగా చెప్పుకోవలసింది సెయింట్ జేవియర్ చర్చి. ఫ్రాన్సిస్ జేవియర్ చనిపోయాక ఆయన దేహాన్ని ఇక్కడే భద్రపరిచారు. ప్రతి పదేళ్లకు ఒకసారి ఈ శరీరానికి పూజచేస్తారు. క్రితం సారి 2004లో ఈ వేడుక జరిగింది. జేవియర్ మమ్మీ ఇప్పటికీ చెక్కు చెదరకుండా సమాధిస్థితిలో ఉన్నట్లు కనిపిస్తుంది. పోర్చుగీసు సంప్రదాయ రీతిలో నిర్మించిన ఈ చర్చి చాలా పురాతనమైనది. పెద్దది కూడా.

ఇంకా గోవాలో చూడాల్సిన ప్రదేశం వెయ్యి సంవత్సరాల సప్తకోటేశ్వర ఆలయం. ఇది నార్వాలో ఉంది. మేయమ్ లేక్, మపుసా టౌన్ గుండా వగటోర్, అంజున, కలన్‌గుటే, అగౌడా ఫోర్ట్, పాంజిమ్ హ్యాండీక్రాఫ్ట్ ఎంపోరియం చూడాల్సిన ప్రదేశాలు. ఇవన్నీ ఉత్తర గోవాలోనివి.

ఇక దక్షిణ గోవా దీన్నే పాత గోవా అని కూడా అంటారు. ఇక్కడ చూడాల్సిన ప్రదేశాలకొస్తే... పోర్చుగీస్ శైలిలో నిర్మించిన చర్చిలు, బోమ్ జీసెస్ బాసిలికా, సె కేథిడ్రిల్, వాక్స్ వరల్డ్ మ్యూజియం, క్రిస్టియన్ ఆర్ట్ మ్యూజియం, మంగేశ్ టెంపుల్, శాంతాదుర్గా ఆలయం, పురాతన గోవా మ్యూజియం, మార్‌గోవా, కోల్వా బీచ్, డోనా పౌలా బే, మిరామర్ బీచ్ ఉన్నాయి.

భారత పోర్చుగీసు శైలిలో నిర్మించిన పాతకాలపు ప్రాసాదాలు గోవాలో మరొక ఆకర్షణ. కానీ ఇవి ప్రస్తుతం చాలా వరకు శిథిలావస్థలో ఉన్నాయి. పాంజిమ్‌లోని ఫౌంటెన్ హస్ అనే ప్రాంతం సాంస్కృతిక ప్రాంతంగా గుర్తింపబడింది. గోవా జీవనాన్ని, నిర్మాణాలను ప్రతిబింబించే పేట అని దీన్ని చెప్పొచ్చు. కొన్ని హిందూ దేవాలయల్లో కూడా ఈ శైలి కనిపిస్తుంది.

**బీచ్‌లో సందడే సందడి**

మార్‌గోవా స్టేషన్‌కి దగ్గర్లోనే కోల్వా బీచ్ ఉంది. దానికి సమీపంలోనే కోల్వా రెసిడెన్సీ వుంది. దీనిని గోవా టూరిజం డెవలప్‌మెంట్ కార్పోరేషన్ నిర్వహిస్తోంది. బీచ్ పక్కనే వుండడంతో బయటి నుంచి చూస్తే సముద్రం అద్భుతంగా కనిపిస్తుంది. అక్కడికి వెళ్లామూ అంటే సాయంత్రం చీకటి పడే వారకూ రాబుద్ధే కాదు. అయినా అక్కడ ఆటలకేం తక్కువ లేవు. వాటర్ స్పోర్ట్స్ ఎన్నుంటాయని! వాటర్ స్కూటర్, బనానా రైడ్, డాల్ఫిన్ వ్యూ... అన్నిటికీ పైసలు కడుతుండాలనుకోండి!! ఇంక రెసిడెన్సీ సంగతులు. అక్కడ భోజనాలు చేసేప్పుడు లోకల్ ఆర్కెస్ట్రా వారు పాటలు పాడుతూ అలరిస్తుంటారు. దీనికి 25 కిలోమీటర్లలో మిరామర్ బీచ్ ఉంది. ఇది గోవా రాజధాని పనాజీకి దగ్గర్లోనే ఉంది. అక్కడికి దగ్గర్లోనే గోవా మ్యూజియం, పోర్చుగీస్ వారి ఇళ్లు చూడొచ్చు. ఇంక డౌనా పోలా బీచ్ సంగతి చెప్పుకోవాలి. అక్కడి నుంచి బీచ్ సౌందర్యం అదరహో! క్రూయిజ్ షిప్ మీద విహారం ఎంత బావుంటుందో. వెండి వెన్నెల్లో మండోవి నదిలో క్రూయిజ్ షిప్ మీద వెళుతూ వుంటే వుంటుందీ... షిప్ డెక్ మీద డాన్సులూ...పాటలూ... పిల్లలూ.. పెద్దలూ... జంటల కేరింతలూ... అంతా ఆహ్లాదంగా గడిచిపోతుంది. మిరామర్ బీచ్‌కి 45 కిలోమీటర్ల దూరంలో ఆరంబోలా బీచ్ వుంది. మారుమూల వుండడంతో ఇక్కడ సందర్శకుల తాకిడి తక్కువగానే వుంటుంది. ఎక్కువగా విదేశీయులు సన్‌బాత్ చేస్తూ కనిపిస్తారు. చపోరా కోట అక్కడికి దగ్గరలోనే వుంటుంది. సముద్రం పక్కన కొండమీద కన్పించే ఆ కోటను అలా చూస్తూ వుంటే పర్యాటకులకు ఆకలి దప్పికలు తెలియవు. 'దిల్ చాహతా హై' సినిమాలో ఒక పాటను అక్కడే చిత్రీకరించారు. కొద్ది దూరంలోనే కలన్‌గుటే బీచ్ వుంది. ఇది గోవాలో చాలా ప్రసిద్ధి చెందిన బీచ్. ఇది గోవాలోని అన్ని బీచ్‌లకు రాణి వంటిదని కూడా అంటుంటారు. ఇక్కడ రద్దీ వుంటుందీ! మాటల్లో చెప్పలేం. ఆసక్తి వుండాలేగానీ పారాసైలింగ్ లాంటి వాటర్ స్పోర్ట్స్ మంచి కాలక్షేపం అవుతుంది. ఆ పక్కనే బగ బీచ్ వుంటుంది. రాత్రిపూట నడిచే పబ్బులకు ఇది మాంచి పేర్గాంచింది. చాలా వరకు పబ్బులు ఇక్కడ రాత్రి 11 గంటల తర్వాతే ప్రారంభమౌతాయట. జంటలకు మాత్రమే ప్రవేశం వుంటుందట.

**గోవా చేరాలంటే...**

బస్‌లో.... హైదరాబాద్ నుండి గోవాకి ఎపి టూరిజం వారి ఐదురోజుల టూర్ ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. ఎసి, నాన్ ఎసి, హైటెక్ కోచ్...ఇలా చాలా రకాలున్నాయి.

రైలులో... హైదరాబాద్ నుండి కాచిగూడ టు యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ఉంటుంది. ఇది వాస్కోడిగామా స్టేషన్‌కు తరువాతి రోజు మధ్యాహ్నం చేరుకుంటుంది. విజయవాడనుండైతే అమరావతి ఎక్స్‌ప్రెస్ (హౌరా-వాస్కోడిగామా) ప్రతి సోమ, మంగళ, గురు, శని వారాల్లో ఉంటుంది.

రైల్లో ప్రయాణమే చవగ్గాను, సౌకర్యంగాను ఉంటుంది.

★



శాంతాదుర్గా ఆలయం

మంగేశ్ ఆలయం



# నవ్వుల్ - పువ్వుల్

## న్యూ లుక్కు

**యువకుడు :** నాకు కొత్త స్టైలు గడ్డం గీస్తావా?

**సెలూన్ వాలా :** గీస్తా. ఒక చెంప మాత్రమే. అప్పుడు అదే కొత్త స్టైల్ అవుతుంది.

## కూరలో తోక

**కస్టమర్ :** ఓరి నాయనోయ్! పూరీ కూరలో బల్లి తోక వచ్చింది. ఇదిగో చూడు.

**సప్లయర్ :** ఆగండి.. ఆగండి... ఆ గోడమీద బల్లిని చూడండి. దాని తోకే తెగి పడ్డట్టుంది. ఆ స్పూనుతో తీసి ఇలా ఇవ్వండి అతికిద్దాం.

## అరడజను గుడ్లు

**కొత్త హీరోయిన్ :** మేనేజర్ గారూ! అర్జంట్‌గా అరడజను కోడి గుడ్లు తెప్పించండి.

**ప్రొడక్షన్ మేనేజర్ :** ఎందుకమ్మా?

**కొత్త హీరోయిన్ :** మా అమ్మా, బాబాయి, మా చుట్టాలు తింటున్నప్పుడు యూనిట్ వాళ్ల కళ్లు పడ్డాయి. మేము దిష్టి తీసుకోవాలి.

## గుండె గీతం

**కొత్త గీత రచయిత :** గుండెలు కరిగించే ఓ విషాద గీతం రాశాను సర్! వినిపించమంటారా?

**కొత్త దర్శక నిర్మాత :** వద్దు నాయనా! నా గుండె అప్పులతో బాధపడుతుంది.

## ఉత్తరాల శోభ

**తండ్రి :** (ఫోన్‌లో) అబ్బాయ్! ఫోన్‌లో మాట్లాడ్డం తగ్గించి ఉత్తరాలు రాస్తున్నావేంటి?

**కొడుకు :** అలనాటి ఉత్తరాల సంస్కృతిని మీ పెద్దలు మర్చిపోతున్నారు! కనీసం మేమైనా మళ్లీ ఉత్తరాలకి ప్రాణం పోద్దామని నాన్నా.

## నేటి చదువులు

**తండ్రి:** ఏరా గోపీ! నిన్న స్కూల్‌కి ఎందుకు వెళ్లలేదు?

**గోపీ :** టీచర్స్ ధర్నా

**తండ్రి :** మరి ఈ రోజు ఎందుకు వెళ్లలేదు?

**గోపీ :** మా విద్యార్థుల ధర్నా.

## తెలుగు క్షోభ

**టీచర్ :** గోపీ! మన తెలుగు భాష అక్షరాలు ఎన్నో ఎప్పుడైనా గమనించావా?

**గోపీ :** ఇంగ్లీషులో చెప్పండి టీచర్. మాకూ తెలుస్తుంది.

## నటుడి పాట్లు

**విలేకరి :** మీరు దుర్యోధనుడి వేషం బాగా వేశారు. పద్యరాగం అదే పనిగా కొన్ని నిమిషాలు రకరకాలుగా పాడారు. ఎందుకని?

**పాత్రధారుడు :** నేను వేసుకున్న దుస్తుల్లో దాక్కున్న నల్లులు తెగ హింసపెట్టాయి. నా రాగానికి భయపడి వదిలిపెడతాయనుకున్నాను. కానీ... ఇదిగో నాటకం పూర్తయినా సరే కుడుతూనే ఉన్నాయి.

## కలవరింత

**భార్య :** ఏవండీ! రోజు రాత్రులు నిద్రలో రాధా... రాధా! అని కలవరిస్తున్నారేంటి? కొత్తగా ఆ అమ్మాయిగానీ పరిచయం అయిందా?

**భర్త :** రాదా... రాదా.. అంటే అమ్మాయి కాదు. నాకు ఉద్యోగంలో ప్రమోషన్ రాదా అని అర్థం.

**- జె.సుధాకర్ పట్నాయక్, కాకినాడ.**

## కన్నీరు



**టీచర్ :** ఏరా చింటూ! చిన్నప్పుడు అందరూ ఏడుస్తారు కానీ పెద్దయ్యాక ఏడవరు ఎందుకని?

**చింటూ :** చిన్నప్పుడు ఏడ్చీ ఏడ్చీ కళ్లలో నీళ్లన్నీ అయిపోతాయి టీచర్.

**ఎం. డేనీశ్యామ్, అనకాపల్లి.**

**జోక్స్ బాగా వేస్తారా? మరైతే ఆలస్యం ఎందుకు! కార్డు మీద రాసి పంపండి. పాఠకులను కడుపుబ్బ నవ్వించండి. మా చిరునామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ప్లాట్‌నెం.21/1, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్**




ఒక్కోసారి ఒక్కొక్కరిని చూస్తే అనిపిస్తుంది. 'అబ్బ...ఎంత దౌర్భాగ్యం ఈ జీవితం. నరకయాతన పడుతున్నా కనీసం చావుకైనా కనికరం కలగలేదే...' అని. అలాంటి ఉదాహరణలు చరిత్రలో, వర్తమానంలో అడపాదడపా కనిపిస్తూనే వుంటాయి. తాజాగా వార్తల్లోకొచ్చిన అరుణా రామచంద్ర శాన్‌బాగ్ ఉదంతం తెలిసినదే. తన ప్రమేయం అణుమాత్రం లేకపోయినా అంపశయ్యకే అంకితమైన అభాగ్యురాలు అరుణ. ఆమెను ఆ స్థితిలో చూచి తట్టుకోలేక... కారుణ్య మరణాన్ని ప్రసాదించమని ఆమె మిత్రురాలు, అడ్వకేట్ పింకీ విరానీ న్యాయస్థానాన్ని ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. మరి మరణమే శరణమైతే ... చట్టం అంగీకరిస్తుందా? అందుకు అనుకూలంగా కొందరు, వ్యతిరేకంగా కొందరు నిలబడ్డారు. కరుణలేని మరణంపై ఈ వారం అట్టమీది కథలో ...

- డా॥ కాకర్లమూడి విజయ్

# మరణమే శరణమైతే...

"మరణం నేరం కాదు" ఈ మాటలు అన్నది జాక్ కేవోర్కియాన్. జాక్ కారుణ్య మరణాలను ప్రోత్సహించిన వ్యక్తి. కనీసం నూట ముప్ఫైమందికి అదే సిద్ధాంతం ప్రకారం చావును 'ప్రసాదించి' తద్వారా వారి వేదనను తుడిచిన వాడు. హత్యానేరంపై జాక్‌ను ఎనిమిదేళ్ల పాటు జైల్లో నిర్బంధించారు. మళ్లీ అటువంటి 'ఘాతుకానికి' పూనుకోనని మాట ఇచ్చాకే విడుదల చేశారు. తగ్గని వ్యాధులతో బాధపడే వారిని విముక్తుల్ని చేయడానికి స్వయంగా తయారు చేసుకున్న ఒక యంత్రం ద్వారా ప్రాణాంతక మందులను ఇచ్చి, చంపి వారి శరీరాలను ఆసుపత్రుల ముందు విడిచి వెళ్లేవాడు జాక్. ఒక దశాబ్దం పాటు ఈ విధంగా చేసిన జాక్‌కి 1999లో శిక్ష పడింది. విడుదలైన తర్వాత స్వయంగా మరణాలకు కారకుడు కాలేదు కానీ తను నమ్మిన కారుణ్య మరణ సిద్ధాంతాన్ని మాత్రం అమలు చేయించడానికి ప్రయత్నాలు చేస్తున్నాడు ఈ ఎనభైమూడేళ్ల వృద్ధుడు.

◆◆◆

'జీవించడానికి అనువుకాని జీవితాన్ని అంతం చేయడానికి అనుమతి' (allowing the destruction of life unworthy of living) అనే పుస్తకం 1920లో ప్రచురించబడింది. కార్ల్ బైండింగ్, ఆల్ఫ్రెడ్ హాక్సే అనే ఇద్దరు జర్మన్లు T4 ని సమర్థించుకున్నారు. నిరర్థక జీవితాలని అంతం చేయడాన్ని సమర్థిస్తూ రాసిన ఆ పుస్తకం హిట్లర్‌కి గొప్ప వరంగా లభించింది. అక్టోబర్ 1939 - ఆగస్టు 1941 మధ్య సుమారు డెబ్బై వేల మందికి పైగా, అధికారికంగా, వైద్యులు చంపేశారు. తమ జాతి స్వచ్ఛంగా, సమర్థవంతంగా ఉండాలని, అందుకు అడ్డు వచ్చే ఎవరినైనా (మానసిక, శారీరక దౌర్బల్యం కలిగిన వారు) అడ్డుతొలగించాలని హిట్లర్ భావించాడు.

◆◆◆

ఎన్నో శతాబ్దాలుగా చర్చనీయాంశంగా వున్న కారుణ్యమరణ అంశం మళ్లీ మన దేశంలో అరుణ శాన్‌బాగ్ ద్వారా ముందుకు వచ్చింది. దేశంలోని అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చినప్పటికీ, అసలు సందిగ్ధం అలాగే మిగిలిపోయింది. ఒక్క మరణానికి తప్ప చివరికి మరణించాలని కోరుకునే వ్యక్తికి కూడా జీవితాన్ని హరించే శక్తి, హక్కు లేదన్నది ఇన్ని చర్చల సారాంశం. అరుణా శాన్‌బాగ్ తీర్పు చదువుతూ న్యాయమూర్తి మార్కండేయ్ కాట్జు ఉటంకించిన గాలిబ్ మాటలు : "మరణాన్ని కాంక్షిస్తూనే ఉంటాం. మరణమూ వస్తుంది. కానీ రాదు"

### కరుణ లేని మరణం

మరణం అతి బాధాకరమైనది- మరీ ముఖ్యంగా మృతుల దగ్గరివారికి. కానీ కొన్ని సందర్భాల్లో కొన్ని దీర్ఘకాల వ్యాధుల వల్ల జీవితమూ అత్యంత బాధాకరంగా ఉంటుంది. అటువంటి సందర్భాల్లో చావే నయం అనిపిస్తుంది కూడా. కానీ ఇటు జీవితంపై ఆశ, దగ్గరివారి ప్రేమ, వైద్యుల సేవలూ జీవితాన్ని కొనసాగనిస్తుంటాయి. కానీ బాధ కూడా కొనసాగుతూనే ఉంటుంది. ఆ వ్యక్తి పడే దుర్భర వేదన చూసిన వాళ్లందర్నీ కదిలిస్తుంది. కలచివేస్తుంది. ఆ సమయంలో ఎవరైనా చేయగల సహాయం ఏదైనా ఉంటే అది ఆ వ్యక్తికి మరణాన్ని ప్రసాదించడమే! కనీసం ఆ వ్యక్తికి వేదనను తగ్గించిన వారమయ్యామనే భావన ఉంటుంది. కానీ మరణాన్ని 'ప్రసాదించడం' ఎలా? మరణాన్ని ఏ రకంగా కలిగించినా అది అమానుషమే కదా. హత్యే కదా. ఘోరమే కదా? అయితే ఇక్కడ మనం గమనించవలసింది అవతలి బాధితుడు ఎటువంటి పరిస్థితుల్లో జీవిస్తున్నాడన్నది. శారీరక, తద్వారా మానసిక వేదనకు గురైనప్పుడు, ఆ వేదనను మానవ ప్రయత్నాలు తగ్గించలేనప్పుడు, మరో దారి లేనప్పుడు, బాధతో జీవించడమా, బాధైనా మరణించడమా అన్న మీమాంసలో మరణమే మంచిదని కొందరి వాదన.

### హిపోక్రటీస్ ఏమన్నాడు?

"నా అంతట నేను గానీ, రోగి కోరినా గానీ, మరెవరైనా సలహా ఇచ్చినా గానీ నేను ఎవరికీ ప్రాణాంతకమైన మందును ఇవ్వను"

వైద్యశాస్త్రం చదివిన వారు చేసే హిపోక్రటీస్ ప్రతిజ్ఞ లోని ఒక వాక్యం ఇది. క్రీస్తుకు పూర్వం

# ఎవరీ అరుణా శాన్‌బాగ్?

అరుణా రామచంద్ర శాన్‌బాగ్ ముంబై లోని కె.ఇ.ఎమ్ ఆసుపత్రిలో పనిచేసే ఉపచారిక. నవంబరు 27, 1973 రాత్రి అదే ఆసుపత్రిలో స్వీపర్‌గా పనిచేస్తున్న సోహన్ లాల్ వాల్మీకి ఆమెను కుక్క గొలుసుతో గొంతు బిగించి, అత్యాచారం జరిపాడు. మెడకు బిగిసిన చెయిన్ మెదడుకు ప్రాణవాయువు సరఫరా తగ్గించిన కారణంగా ఆమె సంపూర్ణంగా నిర్వీర్యమైపోయింది. అప్పటి నుండి అరుణ ఆసుపత్రి మంచానికే అంకితమైపోయింది. నోటి ద్వారా మెత్తని భోజనం పంపడం నుండి సకల సపర్యలూ మంచం మీదనే. ఆహారం తీసుకోవడం అన్న ఒక్క అంశం మినహా ఆమె ఏ కోణంలోనూ మనవ జీవితం అనుభవించడం లేదన్నది పింకీ విరానీ అనే జర్నలిస్టు వాదన. ఆ కారణంగా అరుణకు కారుణ్య మరణం ప్రసాదించమని ఆమె కోర్టును కోరింది. గత ఏడాది డిసెంబరు 17న ఈ కేసును స్వీకరించిన అత్యున్నత న్యాయస్థానం ఈ నెల ఏడున పింకీ విరానీ అభ్యర్ధనను తోసిపుచ్చింది.

అయితే ప్రాణాలు హరించే దిశగా మందులు ఇచ్చేకన్నా కీలకమైన మందులు, వైద్యం, ఆహారం వంటివి ఆపేయడం ద్వారా (పాజిటివ్) మరణాన్ని ఇవ్వవచ్చన్న తీర్పు సంచలనం రేపింది.

ఇంతకాలం అరుణను కంటికి రెప్పలా చూసుకుంటున్న ఆమె సహోద్యోగులు ఈ తీర్పుతో ఆనందం వెలిబుచ్చారు. "అరుణ ఒక చంటిపాపలా ఉంది. మాలాగే ఆమెకీ వయసు పెరుగుతోంది. ఆమె మాకేమీ భారం కాదు. ఇబ్బందీ కాదు. ఆమెకు సపర్యలు చేయడం మాకెంతో సంతోషం. ఆమె ప్రాణాలు తీయడానికి మేం ఒప్పుకోం. కోర్టు ఈ కేసు కొట్టేసినందుకు సంతోషం' అంటున్నారు.

కొసమెరుపు : ఒక నిండు జీవితాన్ని 27 ఏళ్లపాటు నిరర్థకంగా ఉండిపోవడానికి కారణమైన సోహన్‌లాల్ వాల్మీకికి పడిన శిక్ష ఏడేళ్లు. శిక్షకి కారణం దోపిడీ, హత్యాయత్నం!!

400 ఏళ్ల క్రితమే వైద్యశాస్త్ర పితామహుడు హిపోక్రటీస్ రూపొందించిన ప్రతిజ్ఞ ఈనాటికీ ప్రపంచవ్యాప్తంగా వైద్యులకు వారి బాధ్యతలను గుర్తుచేసే దిక్సూచి.

అయితే ప్రాచీన రోమన్లు, గ్రీకుల అభిప్రాయం వేరుగా ఉండేది. వారి దృష్టిలో జీవించడం ఇష్టంలేని వారికి, మరణం కోరుకున్న వారికి మరణాన్ని 'ఇవ్వడం' మంచిదే. కానీ పధ్నాలుగవ శతాబ్దంలో ఆత్మహత్య, లేదా ఆత్మహత్యకు తోడ్పడడం నేరాలుగా పరిగణించబడ్డాయి. న్యూయార్కులో 1828లోనే యుథనేసియా (మంచి మరణం)కి వ్యతిరేకంగా చట్టం చేయబడింది.

యుథనేసియాలో రెండు రకాలున్నాయి. స్వచ్ఛందంగా వ్యక్తి కోరే మరణం. మరోటి ఆ వ్యక్తికి వేదన తగ్గించే ప్రయత్నంగా ఇతరులు కలిగించే మరణం. పంతొమ్మిది వందల ముప్పయ్యవ దశకంలో హిట్లరు రెండవ రకపు యుథనేసియాని విరివిగా అవలంభించాడు.

'యాక్షన్ టి4' అనే పేరుతో నాజీలు "జీవించడానికి తగని జీవితాన్ని" నిర్మూలించే కార్యక్రమం చేపట్టారు. హిట్లరు స్వయంగా ఆ పనికి ఆదేశించాడు. తొలుత వారి దృష్టి పసిపిల్లలపై ఉండేది. బుద్ధిమాంద్యం, అవిటితనం వంటి లక్షణాలున్న పిల్లల్ని చంపేసేవారు. ఆ తరువాత దీర్ఘకాల వ్యాధులతో నయం కాని జబ్బులతో ఉన్న వారిని కూడా 'అతి జాగ్రత్తగా పరీక్షించిన తర్వాత' 'కారుణ్య' మరణాన్ని ప్రసాదించవలసిందని హిట్లరు ఆదేశాలు జారీ చేశాడు. 1945 కల్లా సుమారు మూడు లక్షల మంది జర్మన్లు ఆ విధంగా 'చనిపోయారు'.

**చట్టబద్ధం చేసిన దేశాలు**

కారుణ్య మరణాలపై భిన్నాభిప్రాయాలు ఎప్పుడూ ఉన్నాయి. గత శతాబ్దపు ముప్పయ్యవ దశకాల్లోనే యుథనేసియాకి అనుకూలంగా కొన్ని సంస్థలు ఏర్పాటయ్యాయి. ఆస్ట్రేలియాలో 1995లో అనుకూలంగా ఒక బిల్లు ప్రవేశపెట్టారు. అది 1996లో అమల్లోకి వచ్చింది. ఆ మరుసటి ఏడు నిషేధించబడింది! అమెరికాలో 1998లో ఓరిగాన్ రాష్ట్రంలో యుథనేసియా చట్టబద్ధం చేయబడింది. రెండు వేల సంవత్సరంలో నెదర్లాండ్ యుథనేసియాని చట్టబద్ధం చేసి, అలా చేసిన తొలి దేశంగా నిలిచింది. ఈనాడు బెల్జియం, లక్సెంబర్గ్, స్విట్జర్లాండ్ దేశాలు కూడా నెదర్లాండ్ సరసన చేరాయి. అమెరికాలో ఓరిగాన్ సరసన వాషింగ్టన్ రాష్ట్రం చేరింది.

**మన దేశంలో...**

మన దేశంలో కొన్ని వారాల క్రితం వచ్చిన సుప్రీం కోర్టు తీర్పు 'సాత్విక' (పాజిటివ్) కారుణ్య మరణాన్ని అవలంభించ వచ్చని చెప్పింది. అయితే సదరు బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందేవరకు ఇప్పటి వరకు ఉన్న ఆంక్షలు అలాగే ఉంటాయి. ఆ బిల్లు వచ్చిన తర్వాత ఏదో రకంగా కారుణ్య మరణాలని చట్టబద్ధం చేసిన దేశాల క్రమంలో మన దేశమూ చేరుతుంది.

కారుణ్య మరణాలు ఎంత వరకు సమంజసం అన్నది ఇప్పట్లో సమాధానం దొరకని ప్రశ్న. ఒక మూడు నాలుగు దశాబ్దాల కిందట 'అబార్షన్' అనేది తల్లి ప్రాణాన్ని కాపాడడానికి మాత్రమే అవసరమైన ప్రక్రియగా వాదించేవారు. కానీ ఇప్పుడు 'తొందరపాటు' గర్భాలనీ, అవాంఛనీయ (ఆడశిశువులైతే) గర్భాల్నీ తొలగించుకోవడానికీ అబార్షన్లు సాధారణమైపోయాయి. తోటి మనిషి బాధలో ఉంటే ఆ బాధ తొలగించే ప్రయత్నాలు చేయడం మానవీయత. ఆ

అరుణా శాన్‌బాగ్

## అత్యున్నత తీర్పు

మెర్సీ కిల్లింగ్ అనేది తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే చట్టం యొక్క అనుమతితో తీసుకోవాల్సిన చర్య. గతంలో కూడా చాలా కేసుల్లో సుప్రీంకోర్టు ఇలాంటి ఉత్తర్వులివ్వడానికి నిరాకరించిన సందర్భాలున్నాయి. "బ్రెయిన్ డెడ్" అయితేనే ఇలాంటి చర్యలకు అనుమతినిస్తారు.

నర్స్ అరుణ రామచంద్ర శాన్‌బాగ్ గత కొన్ని సంవత్సరాలుగా మంచంపైనే పడుంది. తన పనులు తాను చేసుకోలేక స్పృహ ఉన్నా...లేకున్నా...బ్రతికుండి బాధను భరించలేకుండా ఉన్నదని శాన్‌బాగ్ మళ్లీ సుప్రీం ధర్మాసనం ముందుకు వచ్చింది. చట్టంలో మెర్సీ కిల్లింగ్ (కారుణ్య మరణం) అనేది ఎక్కడా ఉదహరించలేదు. కావున చట్టపరంగా అనుమతినిచ్చే ... నిరాకరించే ప్రసక్తి రాదు అని అత్యున్నత ధర్మాసనం తీర్పునిచ్చింది.

మరణం సంభవించేవరకు జీవితాన్ని పరిపూర్ణంగా అనుభవించడానికి అర్హత ఉంటుందనేది సారాంశం.

చట్ట ప్రకారం మెడిసిన్ ఇవ్వకుండా పరోక్షంగా జీవితాన్ని పొడిగించకుండా కొన్ని ప్రత్యేక కారణాల వల్ల మరణాన్ని కల్గించవచ్చు. కానీ మందులు ఇచ్చి చేజేతులా ఎట్టి పరిస్థితుల్లోనూ చంపకూడదు. దీనికి చట్టం అనుమతించదు అని మానవత్వం పరిఢవిల్లేలా సుప్రీం ధర్మాసనం 7-3-11న తీర్పు చెప్పింది.

**జి.ఎల్.నరసింహారావు,**
హైకోర్టు అడ్వకేట్.

సుప్రీం తీర్పు కె.ఇ.ఎమ్ ఉద్యోగులకు ఎంత తీపి వార్తో!



జాక్ కేవోర్కియన్

ప్రయత్నాలు విఫలమైతే, ఆ బాధ ప్రకోపిస్తే, ఆ బాధితుడు కోరితే అతనిని ఆ బాధ నుండి, ఆ జీవితం నుండి విముక్తుణ్ణి చేయడం కూడా మానవీయతే అంటారు కొందరు. అసలు ప్రాణాలు తీసే హక్కు వైద్యులకు ఎవరిచ్చారంటారు ఇంకొందరు. వైద్యం ఉన్నది బాధితులకు సుఖాన్నివ్వడానికే. అంటే బాధను తొలగించడానికే. ఆ తొలగింపు మరణం వల్లనే సాధ్యపడుతుంది అనుకున్నప్పుడు ఆ మరణాన్ని త్వరితం చేసి వేదనను తగ్గించడం మంచిదే కదా అన్నది కొందరి సూచన.

ఈ సమస్య ఇలా ఎప్పటికీ జటిలంగానే ఉంటుంది. కారణం నిర్ణయాధిక పేషెంటు కోరినంత మాత్రాన చంపేయవచ్చా? 'తీవ్రమైన బాధ'ను నిర్ణయించేది ఎవరు? ఆత్మహత్యకు పురిగొల్పే పరిస్థితులన్నీ ఆయా వ్యక్తులకు తీవ్రమైనవే! పరీక్షలో తప్పడం, ప్రేమ విఫలమవడం, అమ్మ తిట్టడం, డిప్రెషన్, ఇంట్లో ఆర్థిక సమస్యలు, ఒంట్లో అనేక సమస్యలు వంటివి ఆ పరిస్థితులను భరించలేనివే. ఆ కారణాలను సాకు చేసుకుని "భరింపరాని మానసిక బాధ ఉంది డాక్టర్, ఒక ఇంజెక్షన్ ఇచ్చి, చంపేసి పుణ్యం కట్టుకోండి" అని ఎవరూ వెళ్లరా? ఫీజు తీసుకుని డాక్టర్లు కారుణ్య మరణాలు సునాయాసంగా ప్రసాదించవచ్చు! అందువల్ల యుథనేసియాకి వ్యతిరేకత అధికంగా ఉంది.

కానీ అందరికీ 'అందుబాటు'లో లేని వైద్యం (అధిక ఖరీదు కారణంగా) వల్ల చాలా వ్యాధులు ముదిరి దీర్ఘకాలిక పరిస్థితులుగా మారుతున్నాయి. వైద్య ఖర్చులు తగ్గించుకునే లేదా మిగుల్చుకునే నెపంతో కూడా రోగులు మరణాన్ని కోరుతున్నారు. విశాఖపట్నంలో ఇటీవల వెలుగులోకి వచ్చిన ఈశ్వరరావు ఉదంతం మరో కోణాన్ని చూపుతోంది. తప్పుడు రోగ నిర్ధారణ, శస్త్రచికిత్స సరిగా చేయకపోవడం వల్ల ఈశ్వరరావు ఇబ్బంది పడ్డాడు. లేని హెచ్ఐవి ఉన్నట్లు చూపడం వల్ల గ్రామస్థులు, బంధువులు తనని వెలివేసినట్లు చూస్తున్నారని, తన మానసిక వేదన భరించలేకపోతున్నానని, తనకు మరణం ప్రసాదించాలంటూ జిల్లా కలెక్టరుకు దరఖాస్తు చేసుకున్నాడు. ఇటువంటి అనేకానేక విచిత్ర పరిస్థితుల నేపథ్యంలో యుథనేసియాకి పచ్చజెండా ఊపితే ఉపద్రవమే అని భావించి కాబోలు న్యాయస్థానం అందుకు ఆమోదం తెలుపలేదు.

### చట్టబద్ధమా! కాదా!

అయినా, మనకి కారుణ్య మరణం చట్టబద్ధమా కాదా అన్న సమస్య లేదు. సరైన వైద్యం సకాలంలో అందక చనిపోయేవారు కోకొల్లలు. అసమర్థ వైద్యుల కారణంగా వైద్యం వికటించి ప్రాణాలు విడిచినవారు అసంఖ్యాకులు. డబ్బిస్తే తప్ప మందివ్వననే 'జబ్బున్న' డాక్టర్ల చేతిలో హరీమన్న వాళ్లకు లెక్కలేదు.

పెంపుడు జంతువులు, రేసుగుర్రాలు గాయాలతో విలవిల్లాడుతుంటే యజమానులు వాటిని చంపి వాటికి బాధావిముక్తి కలిగించేవారు. యుద్ధాల్లో తోటి సైనికులు దెబ్బలతో అల్లాడిపోతుంటే వారికి చావు ద్వారా సుఖాన్ని ఇవ్వడం మామూలే. కానీ సాధారణ పౌరుల జీవించే హక్కుకి గౌరవమివ్వాలా? వారు కోరే మరణానికి విలువ ఇవ్వాలా? అన్నది తేలని సమస్య. కరుణ చూపవలసింది జీవితం వైపా? మరణం వైపా? ఎవరి దృష్టి వారిది. అసలీ అంశాన్ని మన దేశంలో చర్చకు తెరతీసిన అరుణా శాంబాగ్ మానవజీవితం కాని జీవితం గడుపుతోంది. ఆమె జీవించినంత కాలం బాధ లేకుండా ఇతరులకు భారం కాకుండా జీవించి, సహజ మరణాన్నే పొందాలని కోరుకుందాం. ★






## ఇసుక లడ్డు తింటుంటే...

**మ**నం ఏదైనా తినేప్పుడు ఇసుక రేణువు ఒక్కటి పంటికింద పడితేనే మొహం వికారంగా పెట్టేస్తాం. తుపుక్కున నోట్లోదంతా ఊసేస్తాం. అలాంటిది గుప్పిట నిండా ఇసుక తీసుకుని నోట్లో వేసుకుని నమిలి తినాలంటే... ఇంకేమైనా వుందా! ఊహించడానికే వికారంగా వుంది కదూ. కానీ ఓ రష్యా మహిళ నిత్యం ఆ విధంగానే ఇసుకను భోంచేస్తోంది. చూడండి సున్నుండ తిన్నంత ప్రియంగా ఎలా తింటోందో ఇసుకను. ఆమె ప్రతి రోజూ ఓ బకెట్ తీసుకుని ఊరికి దూరంగా వున్న ఇసుక దిబ్బ దగ్గరకు వెళ తుంది. చక్కగా బకెట్ నిండా ఇసుక నింపుకుంటుంది. ఇంటికి వచ్చేస్తుంది. ఇంక టిఫిన్, కాఫీ, భోజనం ... అన్నీ ఆ బకెట్ ఇసుకే. ఆమెకు అది తింటేనే నోటికి రుచిగా వుంటుందిట. జిహ్వకో రుచి అని పెద్దలు ఊరకే అన్నారా మరి! ఇలాంటి వారిని చూచే అనుంటారు.

## పతాకాల పచ్చబొట్లు

**ఈ** మధ్య పచ్చబొట్లు పిచ్చి పట్టుకుంది బాగా. విదేశాల్లో అయితే మరీనూ. వంటి నిండా రకరకాల ... రంగురంగుల పచ్చబొట్లు పొడిపించుకోవడం ఫ్యాషనైపోయింది. ఒక్కొక్కరిది ఒక్కో థీమ్. కొందరు తమకు ఇష్టమైన పక్షులు, జంతువులు, మనుషులు, కట్టడాలు, చెట్లు, పాటలు, గేయాలు... పచ్చబొట్లుగా వేయించుకుంటారు. కొందరైతే తమకు అత్యంత ప్రియమైన వారి పేర్లు పచ్చబొట్టుగా పొడిపించుకుంటారు. ఇక్కడ చూడండి! ఈయన పేరు రిషి. దగ్గరదగ్గరగా 70 ఏళ్లుంటాయి. ఈయనగారు ఇప్పటికే నాలుగు సార్లు గిన్నిస్ బుక్‌లోకి ఎక్కేశాడు. అయితే ఇప్పుడు తాజాగా ఐదోసారి కూడా గిన్నిస్ బుక్‌లో పేరు సంపాదించాలని తహతహలాడుతున్నాడు. అదీ పచ్చబొట్లు పొడిపించుకుని. అదీ వివిధ దేశాల పతాకాలను వేయించుకొని. చూశారుగా నుదుటి మీద జండాలు. అలా వంటి నిండా ప్రపంచంలోని 220 దేశాల జండాలను తన వంటిమీద పచ్చబొట్ల రూపంలో చూసుకోవాలని ముచ్చటపడుతున్నాడు. ఒక్కో జండా ఒక్కో అంగుళం సైజులో వుంటేగానీ అన్నిటికీ స్థలం సరిపోదని చెప్తున్నాడు. ప్రస్తుతం ఆ పనిలోనే ఆయనగారు బిజీగా వున్నారు. అన్నట్లు ఈయన మన భారతీయుడే.

# తెలుసా!

## పేద్ద బర్గర్

**ఏ**వండీ మనం ఎన్ని చెప్పుకున్నా ఇది వింత లోకం. ఎప్పుడూ ఏదో ఒక విచిత్రం చేసి పేరు సంపాదించాలనుకునేవారికి లోటేం లేదు. చూశారుగా. ఎంత పెద్ద బర్గర్ మీ ముందుందో. దీని బరువు సంగతేమో కానీ ఇది 30 సెంటీమీటర్ల వ్యాసార్ధంలో వుంది. కిలోలకొద్దీ ఎద్దు మాంసం, వెన్న, టమోటాలు, ఉల్లిపాయలు, బన్ను... ఉపయోగించి దీన్ని తయారుచేశారు. సరే ఆ పెద్ద మనిషి పేరేంటంటారా! సందీప్ డే. ఆయనగారికి బ్రిటన్‌లో ఓ రెస్టారెంట్ వుంది. అందుకే ఈ ఐడియా వచ్చినట్టుంది. తమాషా ఏంటంటే ఈయన కస్టమర్ దేవుళ్లకు ఓ అవకాశం ఇస్తున్నాడు. అదేమంటే ఆ పేద్ద బర్గర్‌ను రెండంటే రెండే గంటల్లో ఒక చిన్న ముక్క కూడా మిగలకుండా లాగించేస్తే 200 పౌండ్లు ఇస్తానంటున్నాడు. ఒకవేళ తినలేక పోతే బర్గర్ ఖరీదు అంటే 30 పౌండ్లు ఇవ్వమంటున్నాడు. అలా చాలామంది ప్రయత్నించి విఫలమయ్యారు. ఏమైతేనేం ఇలా ఆయనగారి పేరు టీవీల్లో, పత్రికల్లో విపరీతంగా ప్రచారమైంది. మరి మన బర్గర్ వాలాకు కావాల్సింది అదే కదా.



కథ

# బిచ్చగాడు

**మం**చిర్యాల రైల్వే ప్లాట్‌ఫారమ్ ప్రయాణీకుల సందడితో కళకళ లాడుతూ మురిసిపోతోంది.

భిక్షాటన రాబడి ఎక్కువగా ఉంటోందని ఆ ప్లాట్‌ఫారాన్ని ఆధారం చేసుకునే జీవిస్తున్నారు ఎక్కువ మంది భిక్షగాళ్లు. ప్రయాణీకుల రద్దీ బాగా ఉంటేనే వాళ్లకు ఆనందం. అలా జీవిస్తున్న వాళ్లలో ఒకడు పెద్దయ్య. పెద్దయ్య కైనా, మిగతా భిక్షగాళ్లకైనా సమయం గడిచేది ప్రయాణీకుల రాకపోకలు ఉంటేనే. వారి సంభాషణలు వింటూ అడుక్కోవడంతో వాళ్లకు సమయం తెలీదు.

పెద్దయ్య కూర్చున్న దగ్గర్లోనే బెంచీపైన ఓ ప్రయాణీకురాలు ఎవరికోసమో ఎదురు చూస్తూ కూర్చుంది. ఆమె తన పక్కన కూర్చున్న మరో ప్రయాణీకురాలితో 'ఈ రోజు మా ఆయన పనికి సెలవు. ఇంట్లోనే ఉన్నాడు. ఆయనతోనే వంటంతా చేయించా' అంది గొప్పగా ఏదో సాధించినట్టు.

ఆ సంభాషణను విన్న పెద్దయ్య లోలోనే నవ్వుకున్నాడు. మరో బెంచీమీద కూర్చున్న ఓ యువజంట గుసగుసలు, పకపకలు వింటుంటే పెద్దయ్యకు చనిపోయిన తన భార్య స్ఫురణకొచ్చి బాధకు లోనయ్యాడు. ఆమెతో గడిపిన రోజులను గుర్తుచేసుకుని మధురానుభూతిని పొందాడు.

ఇలాంటి ప్రేమ జంటలు తరచుగా ఆ ప్లాట్‌ఫాం బెంచీలపై కూర్చుని ప్రేమ పాఠాల్ని వల్లెవేసుకుంటూ ఉల్లాసంగా గడుపుతూనే ఉన్నాయి. ఆ దృశ్యాల్ని చూస్తున్నంతసేపు పెద్దయ్యకు సమయం ఎలా గడిచిపోతుందో తెలీదు.

ఒకరోజు ఓ యువకుడు ఓ యువతితో తన ప్రేమను వ్యక్తపరుస్తూ హఠాత్తుగా ఆమె గొంతును పట్టి పిసికేస్తూంటే, ఆమె అరుస్తుంది. ఇది గమనించిన పెద్దయ్య "ఒరే! ఒరే ఆపరా!" అరుస్తూ నివారించబోయాడు. ఆ అరుపుల్ని విన్న తోటి ప్రయాణీకులు సమీపానికి చేరుకుని దురుసుగా వ్యవహరించిన ఆ యువకుణ్ణి పట్టుకుని బాగా కొట్టారు. ఆ యువతి ఏడుస్తూ తనను ప్రేమించమని బలవంతం చేస్తున్నాడని తనకలాంటి అభిప్రాయం లేదని చెప్పింది.

అక్కడున్న వారిలో ఓ పెద్దమనిషి ఆ అమ్మాయి ఇంటి ఫోనునెంబరు అడిగి తీసుకుని ఇంటికి ఫోను చేశాడు. ఆమె అమ్మా నాన్నలతో విషయాన్ని చెప్పి, వెంటనే వచ్చి తమ కూతురును తీసుకెళ్లమని సూచించాడు. కొద్దిసేపట్లోనే ఆ అమ్మాయి తల్లిదండ్రులు వచ్చారు. తమ కూతురుకు సహాయం చేసినందుకు అక్కడి వారికి ధన్యవాదాలు తెలిపారు. అయితే వారంతా ఈ విషయంలో చొరవ చూపింది పెద్దయ్యనే బిచ్చగాడని, ఆ కృతజ్ఞతలు చెప్పాల్సింది పెద్దయ్యకేనన్నారు. అందుకు ఆ దంపతులు పెద్దయ్యకు ధన్యవాదాలు తెల్పుతూ ఆయన్ని మెచ్చుకున్నారు. మనిషైనోడు ఈ మాత్రం మానవత్వం ప్రదర్శింపకపోతే వాడి బతుకెందుకని తన నైజాన్ని వ్యక్తం చేసాడు పెద్దయ్య. వారు డబ్బులు ఇవ్వబోయినా తీసుకోలేదు. చేసేదిలేక ఆ దంపతులు తమ కూతురుతో వెళ్లిపోయారు.

మరోసారి మరో సంఘటన జరిగింది. అవి దసరా పండగ రోజులు. ఆ ప్లాట్ ఫాంపై ప్రయాణీకుల రద్దీ చాలా ఎక్కువగా ఉంది. అందరూ రైలు కోసం ఎదురు చూస్తున్నారు. కొద్దిసేపట్లో రైలు వచ్చింది. రద్దీ ఎక్కువగా ఉండడం వల్ల రైలు ఎక్కేందుకు తోసుకుంటున్నారు. కొద్దిసేపట్లోనే రైలు కదిలింది.

ఎవరో ఒక ప్రయాణీకుడు రైలు ఎక్కే హడావుడిలో తన సూట్‌కేస్‌ను అక్కడే మర్చిపోయినట్లున్నాడు.

ఆ సూట్‌కేస్ పెద్దయ్య దృష్టిలో పడింది. అతను దాన్ని పట్టుకుని తెరిపార చూశాడు. ఎవరిదో అనుకుంటూ ఒక చేతిత్తో సూట్‌కేస్‌ను, మరో చేత్తో ఊతకర్రను పట్టుకుని ముందుకు నడుస్తున్నాడు. అక్కడే ఉన్న మిగతా బిచ్చగాళ్లు పెద్దయ్యను సమీపించి "ఒరేయ్ పెద్దయ్యా! సూట్‌కేసునెటు తీసుకెళ్లుతున్నావ్‌రా? అందులో ఏమున్నా మనందరం పంచుకోవాల్సిందే" అని గట్టిగా అన్నారు.

"ఇందులో ఏముంటే మీకేంటి? దీనిని మీకిచ్చేదిలేదు. ఇది మన అయ్యలు సంపాదించి ఇచ్చింది కాదు. ఈ సూట్‌కేస్ ఎవరిదో వారికే చెందాలి. అంతేమరి! గట్టిగానే బదులు చెప్పాడు పెద్దయ్య.

పెద్దయ్య నుండి జవాబు దురుసుగా వచ్చేసరికి ఆ ముగ్గురు "ఇలా చెబితే వాడు వినడు. ఆ సూట్‌కేసును లాక్కోవాల్సిందే పదండి!" అన్నారు. పెద్దయ్య వేగంగా వెళ్లి స్టేషన్ మేనేజర్ కార్యాలయంలోకి దూరాడు వాళ్లకు చిక్కకుండా తాననుకున్నది నెరవేరాలని. ఇక తమ ఆటలు సాగవని ఆ ముగ్గురు బిచ్చగాళ్లు వెనక్కి మళ్లారు మంచి అవకాశం చేజారిందనుకొంటూ.

పెద్దయ్య సూట్‌కేసుతో మేనేజర్ దగ్గరికి వచ్చాడు. స్టేషన్ మేనేజర్, అక్కడి మిగతా సిబ్బంది పెద్దయ్యని గమనించారు.

పెద్దయ్య ప్లాట్‌ఫారంపై అడుక్కునే విషయం వారికి తెల్సిందే. అయితే అతని చేతిలో సూట్‌కేస్ ఉండడంతో కొంత విస్మయానికి లోనయ్యారంతా.

"ఏంటి పెద్దయ్యా! ఆ సూట్‌కేసెక్కడిదీ?" అడిగాడు స్టేషన్ మేనేజర్.

"దీన్ని మీకే అప్పచెప్పాలని వచ్చానయ్యగారు. దీన్ని ఇంతకుముందు వెళ్లిన రైలు ప్రయాణీకుడెవరో మర్చిపోయి వెళ్లాడు' అంటూ ఆ సూట్‌కేసును స్టేషన్ మేనేజర్ టెబుల్‌పై పెట్టాడు.

"ఓహో అలాగా! నీవు చాలా మంచిపని చేశావు. దీనికోసం ఎవరైనా వస్తారేమో చూద్దాం. రాగానే వారికందజేస్తాను" అన్నాడు మేనేజరు.

"ఔనండయ్యగారు సూట్‌కేస్‌కోసం వాళ్లు ఎంత ఆందోళన పడుతున్నారో! ఎంత ముఖ్యమైనవి అందులో ఉన్నాయో" బదులిచ్చాడు పెద్దయ్య.

"నీవు స్వార్థంగా ఆలోచించకుండా, ఆ సూట్‌కేస్ వారి గురించే ఆలోచిస్తున్నావ్. ఈ పని నీకు ఎప్పటికైనా మేలు చేస్తుంది" అన్నాడు మేనేజర్.

"మీ మంచితనంతో అంటున్నారు సార్. వెళ్లొస్తాను నమస్కారం" అని బయటకు వెళ్లిపోయాడు పెద్దయ్య.

సూట్‌కేసుపై పేరు, చిరునామా ఉన్నాయేమోనని చూచాడు స్టేషన్ మేనేజర్.

అలాంటివేమీ కనిపించలేదు. దాన్ని అక్కడే అలమరాలో భద్రపరిచాడు. దానికి సంబంధించినవారు వచ్చి అడిగితే ఇవ్వడానికని.

ఇంతలో స్టేషన్ ముందుకొచ్చి ఓ ముగ్గురు ప్రయాణీకులు మేనేజర్ కోసం వాకబు చేస్తున్నారు. అదే విషయాన్ని ఆఫీస్ అటెండరు వచ్చి మేనేజర్‌కి చెప్పాడు.

అనుమతివ్వడంతో ఆ ముగ్గురు లోనికి వచ్చి స్టేషన్ మేనేజర్‌కు నమస్కారం చేశారు.

ప్రతి నమస్కారం చేసి "ఏంటి ఏం కావాలి మీకు?" అడిగాడు మేనేజర్.

"మేము ఇప్పుడే వెళ్లిన రైలులో ఎక్కేప్పుడు తొందరలో నా సూట్‌కేసును ప్లాట్‌ఫాం మీదే మరిచిపోయాం. మీకేమైనా దాని ఆ చూకి తెలిస్తే చెప్పగలరా?" అడిగాడు ఆ ముగ్గురిలో ఒకతను.

"ఓ అలాగా? ప్రయాణంలో అంత నిర్లక్ష్యం ఉంటే ఎలాగండీ? దానిపై మీ పేరుందా? రంగేమిటో చెప్పగలరా?" సూట్‌కేస్ స్వంతదారుడా? కాదా? అని తెల్సుకోవడానికి అడిగాడు మేనేజర్.

"పైన నా పేరు లేదండి. కలర్ మాత్రం లైట్ బ్లూలో ఉంది" చెప్పాడా వ్యక్తి.

"ఆ సూట్‌కేస్ మీదేనా?" అడిగాడు మేనేజర్ తనతో మాట్లాడుతోన్న వ్యక్తిని.

"ఔను నాదేనండి" అన్నాడావ్యక్తి.

"అయితే మీరు దాన్ని ప్లాట్‌ఫారంపై ఏ చోట వదిలారో చూపించగలరా?"

"మీరొస్తే చూపిస్తాను సార్" అన్నాడావ్యక్తి.

"పదండి వస్తాను" అని వారివెంట వెళ్లాడు మేనేజర్. పెద్దయ్య ఎప్పుడూ కూర్చుని యాచించే స్థలం వద్దకే మేనేజర్ని తీసుకెళ్లి చూపించాడా వ్యక్తి.

పెద్దయ్యను కూడా మేనేజర్ తమ వద్దకు పిలిపించుకుని "పెద్దయ్యా! పొద్దున నువ్వు నాకిచ్చిన సూట్‌కేస్ కనిపించిన స్థలం ఏది?" అడిగాడు.

"అయ్యగారు సూట్‌కేస్ కనిపించింది ఇదిగో ఇక్కడేనండి" బదులిచ్చాడు పెద్దయ్య.

పెద్దయ్య చూపించిన స్థలం, సూట్‌కేస్ స్వంతదారుడు చూపించిన స్థలం ఒకటే అవడంతో నమ్మకం కుదిరింది మేనేజర్‌కు. అంతేకాక సూట్‌కేస్ రంగు కూడా సరిపోయింది. ఇక సూట్‌కేస్ అతనికి ఇవ్వడానికి నిశ్చయించుకున్నాడు మేనేజర్.

రైల్వే పోలీస్‌ను తన కార్యాలయానికి పిలిచి నిబంధనల ప్రకారం అతని సంతకం తీసుకుని, చిరునామా రాయించుకుని సూట్‌కేస్‌ను అతనికి అందచేసారు స్టేషన్ మేనేజరు.

సూట్‌కేస్ స్వంతదారుడు తన సూట్‌కేస్ తనకు అందగానే సంతోషంతో స్టేషన్ మేనేజర్‌కు ధన్యవాదాలు చెప్పాడు.

మీ వస్తువులన్నీ సూట్‌కేస్‌లో ఉన్నాయో లేదో చూస్కోండి!" అన్నాడు మేనేజర్.

అక్కడే సూట్‌కేస్ తెరచి చూసుకొని "అన్నీ ఉన్నాయండి" అన్నాడతను.

"ఎప్పుడైనా ప్రయాణంలో జాగ్రత్తగా

ఉండాలండి! అది మీకందిందీ అంటే అదిగో ఆ భిక్షగాడు పెద్దయ్య మంచోడు కాబట్టే. అసలు కృతజ్ఞత చెప్పాల్సింది ఆయనకే. అంతేకానీ ఇందులో నా పాత్ర తక్కువే" అన్నాడు మేనేజర్.

వెంటనే పెద్దయ్య వైపు చూస్తూ "పెద్దయ్యా నీ మేలు ఎప్పటికీ మర్చిపోలేను. నీకు కూడా ధన్యవాదాలు. మీ పేరుకు తగ్గట్టు మీ మనసూ పెద్దదే. మీ మంచితనం ఎప్పుడూ మీకు మంచే చేస్తుంది. మీలాంటి వాళ్లు ఉన్నారు కాబట్టే సమాజం మనుగడ ఇంతో అంతో మంచి మార్గంలో నడుస్తోంది." అని పెద్దయ్య మంచితనాన్ని మెచ్చుకుని సూట్‌కేసుని తీసుకుని వాళ్లు వెళ్లిపోయారు.

సూట్‌కేస్ స్వంతదారుడికి చేరడంతో ఎంతో ఆనందపడిపోయాడు పెద్దయ్య.

తోటి బిచ్చగాడి సెల్‌ఫోన్లోంచి పాట వినిపిస్తోంటే ఆలకిస్తున్నాడు పెద్దయ్య. భిక్షాటనతో బాటే కొన్ని అక్రమాలకు పాల్పడుతున్నారు తనతోటి బిచ్చగాళ్లు. అలాంటి నీతిమాలిన పనులకు తనెప్పుడూ వెళ్లలేదు. ఆ బిచ్చగాళ్లందరు పెద్దయ్యను కూడా సెల్‌ఫోన్ కొనుక్కోమని సలహ ఇచ్చారు. అయినా తనకి ఫోన్‌తో అవసరమేముంది. అందుకనే వద్దని ఖచ్చితంగా చెప్పాడు. ఫోన్ అవసరమనుకున్నా రోజు కష్టించి పనిచేసి సంపాదించిన డబ్బుతోనే కొంటానన్నాడు. నాకూ మంచి రోజులు రాకపోతాయా? ఈ భిక్షాటనకు దూరం కాకపోతానా? అవసరమైన వస్తువుల్ని కొనుక్కోకపోతానా అంటూ తన మనసును నెమ్మది చేసుకున్నాడు పెద్దయ్య.

అప్పుడే స్టేషన్ మేనేజర్ నుండి ఆఫీస్ బాయ్ వచ్చి "పెద్దయ్యా! ఓ పెద్దయ్యా నిన్ను స్టేషన్ మేనేజర్ వచ్చి కలవమన్నారు. తొందరగా వచ్చేయ్" అన్నాడు. ఆ పిలుపుని విన్న పెద్దయ్య ఏంటోనని ఆందోళనతో కార్యాలయానికి వెళ్లాడు.

పెద్దయ్యను చూసిన స్టేషన్ మేనేజర్ "పెద్దయ్యా! నీకో శుభవార్త. మన భారతరైల్వే శాఖకు సహకరిస్తున్న వారికి ఉపాధిని చేకూరుస్తున్నారు. అలా అవకాశం లభిస్తున్న వారిలో నీ పేరు కూడా ఉంది" చెప్పి మాటను కొద్దిసేపు ఆపాడు మేనేజర్.

"ఏంటీ నాకు చేయూతనా? అంతటి అవకాశమా?" ఆశ్చర్యంగా అన్నాడు పెద్దయ్య.

"రైల్వేకి, రైల్వే ప్రయాణీకులకి నష్టం, చెడు పేరు రాకుండా ఏ ఇబ్బందులు ఎదురవకుండా చూచేవాళ్లకు రైల్వే యంత్రాంగం బహుమానాల్ని, లేదా మరో విధంగా సహాయం చేసే ఆనవాయితీ ఉంది. నీవు ఆ రోజు దొరికిన సూట్‌కేసును మా ద్వారా ప్రయాణీకునికి ముట్ట చెప్పిన నీ నిస్వార్థాన్ని గుర్తించి రైల్వే శాఖ నీకు మజ్దూర్‌గా ఉద్యోగాన్ని ఇస్తూ ఆజ్ఞా పత్రాన్ని మాకు పంపింది" అన్నాడు స్టేషన్ మేనేజర్.

"అబ్బో! నేను చాలా అదృష్టవంతుడిని సార్" ఆనందంతో అన్నాడు పెద్దయ్య.

"కానీ... నా విషయం రైల్వే శాఖాధికారులకెలా తెల్సింది?" సంశయంగా అడిగాడు పెద్దయ్య మేనేజర్‌ని.

"ఓహో అదా నీ అనుమానం? మేము ప్రతీనెలా స్టేషన్ నివేదికను జనరల్ మేనేజర్‌గారికి పంపిస్తాము. పొందు పర్చాల్సిన విషయాల్ని రాసి చివరలో నువ్వు సూట్‌కేసును మాకందించిన విషయం కూడా రాశాం. దానికి రైల్వే ఉన్నతాధికారులు సంతోషిస్తూ నీకు ఈ ఉద్యోగాన్ని బహుమానంగా ఇచ్చి నిన్ను ప్రోత్సహిస్తున్నారు" అన్నాడు మేనేజర్.

"సరే సార్ నేను చేసిన ఆ మంచిపనికి మీరుకూడా ఈ బాధ్యతాయుతమైన పని అప్పగించారు. ఇదేమి సామాన్యమైనది కాదండి" మహదానందపడుతూ అన్నాడు పెద్దయ్య.

"దానిదేముంది పెద్దయ్యా? మా విధుల్ని మేము నిర్వహించామంతే! సరే, నీ ఉద్యోగ నియామక పత్రాన్ని ఇస్తాను తీసుకో" అని ఒక పుస్తకంలో పెద్దయ్య సంతకం చేయించుకుని ఆ పత్రాన్ని అందచేశాడు మేనేజర్. శుభం కలగాలని మనసులో కాంక్షిస్తూ. పెద్దయ్య ఆ పత్రాన్ని కళ్లకద్దుకుని స్టేషన్ మేనేజర్ గారికి నమస్కారం చేసి తన ప్లాట్‌ఫారం స్థానానికి వచ్చాడు.

తేదీ సమయం ప్రకారం విధుల్లో చేరాడు పెద్దయ్య. సత్ప్రవర్తనతో, క్రమశిక్షణతో బాధ్యతలను నిర్వహిస్తూ, యాచనను పూర్తిగా మానేసి, తన ఇదివరకటి జీవితాన్ని మరువకుండా, మంత్రి పదవిని పొందినంతటి సంతృప్తిగా జీవనాన్ని కొనసాగించుకుంటున్నాడు పెద్దయ్య.

పెద్దయ్యకు ఉద్యోగం రావడం తోటి బిచ్చగాళ్లకు తొలుత ఈర్ష్యగా ఉండేది. కానీ ఆ ఓర్పులేని తనం క్రమంగా 'ధర్మో రక్షతి రక్షితః' అను సుభాషితాన్ని అర్థం చేసుకున్నారు. పెద్దయ్యను ఆదర్శంగా భావిస్తూ తమ నడవడికలో మంచికి స్థానాన్నిస్తున్నారు. ధర్మాన్ని పాటిస్తూ భిక్షాటనను చేసుకుంటున్నారు.

**- తోట సదానందం**

మనలో ఎంతమందిమి మనం తినే తిండి పట్ల చూపాల్సిన జాగ్రత్తను చూపుతున్నాము? ఎక్కువమంది దృష్టిలో కడుపు నింపేది తిండి. తినే తిండి రుచిగా ఉంటే మితిమీరి తింటాం. తిండిలో రుచి తక్కువైతే దాన్ని తోసేస్తాం. మన జీవితకాలం భుజించే ఆహారానికి నిజంగా ఎంతో ప్రాముఖ్యత ఉంది. హడావుడి జీవితంలో తిండి గొప్పదనం, విశిష్టతను మనలో చాలామంది పట్టించుకోరు.




# ఏం తింటున్నాం!


- సి.వి. సర్వేశ్వరశర్మ
ఫోన్ నెం: 9866843982
sarma.chavali@gmail.com

**ఏం** తింటున్నాం? ఎలా తింటున్నాం? అనే విషయాలపై కొంత దృష్టి కేంద్రీకరిస్తే మన జీవితాలు మరింత ఆరోగ్యకరంగా, ఉన్నతంగా ఉంటాయి. తినడం అనేది జాగ్రత్తతో కూడిన సావకాశ ప్రక్రియ. ప్రతి మెతుకు జాగ్రత్తగా, జాగ్రదావస్థలో ఉండి నమిలి తినాలి తప్ప రుచి, ఆకృతి, సువాసన దృష్టిలో ఉంచుకుని కడుపులోకి మింగేయకూడదు.

చాలా కుటుంబాల్లో చక్కని మెనూతో భోజన కార్యక్రమం ముగుస్తుంటుంది. కుటుంబసభ్యులు తగిన విధంగా బట్టలు మార్చుకుని భోజనాల ముందు కూర్చుంటారు. ఎంత సామాన్య భోజనమైనా ప్రేమాభినాలతో వడ్డించుకుంటూ, ఆహ్లాదభరిత వాతావరణంలో తింటే ఎంతో ఆనందభరితంగా ఉంటుంది. ఇది చక్కగా జీర్ణం కావడమే కాక శరీరానికి మంచి శక్తినిస్తుంది.

పండుగలు, శుభకార్యాలు వంటి సందర్భాల్లో భోజనాలు ఒక ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా ఈ తిండిని రకరకాలుగా వర్గీకరించారు.

### రకరకాల తిళ్లు

జపాన్‌కు చెందిన ఒక పరిశోధకుడు తిండిని మాక్రోబయాటిక్స్‌గా అభివర్ణిస్తూ ఇది శరీరంలోని ఉష్ణ, శీతలాల బలాలను తుల్యం చేస్తూ శరీరానికి చక్కని ఆరోగ్యాన్ని సమకూరుస్తుందని తెలియజేశాడు.

మొక్కల నుండి తయారు చేసిన ఆహార పదార్థాలు శరీరంలోని ఉష్ణాన్ని అదుపుచేస్తాయని మెదడును ఆందోళన లేకుండా చేసి శరీర మెటబాలిజమ్ రేటును తగ్గిస్తాయని చెప్పాడు.

జంతువుల నుండి తయారయిన ఆహారపదార్థాలు, దుంపకూరలు వంటివి మెటబాలిజమ్ రేటును పెంచుతాయి. మాక్రో బయాటిక్స్ ప్రేమికులు కేవలం గోధుమ ఆహారమే భుజించారు. ఎందుకంటే వారి సిద్ధాంతం ప్రకారం ఇది శరీరంలోని ఉష్ణాన్ని, శీతలాన్ని అదుపు చేయగల్గుతుంది. అయితే తగిన పౌష్టికాహారం తినని కారణంగా అనారోగ్య సమస్యలు వారిలో తలెత్తాయి. అందువల్ల మాక్రోబయాటిక్స్‌లో న్యాయపరమైన సమీకృత ఆహారానికి ప్రణాళికలు తయారుచేశారు.

### అనాదిగా...

అనేక రకాల వ్యాధులకు చికిత్సగా మనం రకరకాల ఆహార పదార్థాలను అనాదిగా భుజిస్తూనే ఉన్నాం. తులసి ఆకులతో తయారు చేసిన టీని, దగ్గు, ఛాతీ నొప్పులకు విరుగుడుగా వాడడం తెలిసిన విషయమే. వెల్లుల్లిని గుండె బలానికి వినియోగిస్తూ ఉంటాం. నల్లని కళ్లతో ఆరోగ్యవంతమైన శిశువు జన్మిస్తాడని కొబ్బరి, పంచదారలను గర్భిణీలు వాడడం ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఉంది. మాంసాహారం వద్దని శాఖాహారం తినమని ప్రభోదించే వారిని మనం చూస్తూనే ఉన్నాం. మంగళవారం, గురువారం, శనివారాల్లోనూ పవిత్ర దినాల్లోనూ చాలామంది మాంసం ముట్టరు. కొన్ని కుటుంబాల్లో వంటింట్లో ఉల్లి, వెల్లుల్లి ఇప్పటికీ నిషిద్ధమే. వీటివల్ల కోపం, హింసా ప్రవృత్తి పెరుగుతాయని వీరి ఉద్దేశ్యం.

### తిండితో వికారాలు

అధికంగా టీ, కాఫీ, కోకో, చాక్లెట్ల వంటివి తీసుకునే వారికి ఆత్రుత, నరాల బలహీనత, నాడి కొట్టుకోడంలో తేడాలు, నిస్పృహ వంటివి వస్తాయి. రకరకాల ఆహార పదార్థాలు రకరకాల మనుషులపై ప్రభావితం చూపడం ఎంతో ఆసక్తిదాయకమైన విషయం. కొంతమందికి ఇవి ఎలర్జీ కలిగిస్తే మరికొంతమందికి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తెచ్చిపెడతాయి.

అమెరికాలో ఇటీవల నిర్వహించిన ఒక సదస్సులో ప్రత్యేక ఆహార పదార్థాలు మెదడు సామర్థ్యాన్ని ఎలా పెంపొందించగలవో చర్చించారు. సూక్ష్మంగా చెప్పాలంటే విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా గల సమీకృత ఆహారం మెదడు సామర్థ్యాన్ని పెంచగల్గుతుందని వైద్య నిపుణులు తేల్చి చెప్పారు.

మీ శరీరంలోని జీవకణాలు వయసు పెరుగుతున్నా చైతన్యవంతంగా ఉండాలంటే కొవ్వు పదార్థాలను తిండిలో నిషేధించాల్సి ఉంది. మెదడుకు గల సామర్థ్యాన్ని, ప్రసార శక్తిని స్వేచ్ఛా రేడికల్స్ దెబ్బతీస్తాయి. ఈ స్వేచ్ఛా రేడికల్స్ ఆటను యాంటీ ఆక్సిడెంట్స్ అరికట్టగలవు. అందుకే యాంటీ ఆక్సిడెంట్స్ సమృద్ధిగా లభించే తాజాపండ్లను తినాలి.

### ఔషధ మొక్కలు

పలు ఔషధ మొక్కల కషాయాలు జ్ఞాపక శక్తిని పెంపొందించడంలో ఉపయోగపడుతున్నాయని ఇటీవల పరిశోధనల్లో వెల్లడయింది. చిన్న చిన్న అనారోగ్యాలకు ఔషధాలుగా పలు మొక్కలు, వాటి ఆకులు వినియోగపడుతున్న విషయం మనకు తెలిసిందే. ఉదాహరణకు జీలకర్ర జాతికి చెందిన సోంపు వంటివి మంచి జీర్ణకారిగా ఉపయోగపడతాయి. దగ్గు నివారణకు మెంతి ఆకు కూర ఉపయోగపడడమే కాక జీర్ణక్రియకు, విరేచనకారిగా కూడా ఇది సహాయపడుతుంది. వెల్లుల్లి అధిక రక్తపోటును, కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుతుంది. ఇటీవలి కాలంలో వైద్యంలో ఆహార చికిత్స ప్రముఖంగా చోటుచేసుకుంటోంది. సరియైన ఆహారం తీసుకుంటే వ్యాధులకు చికిత్సగా మాత్రమే కాక నివారణ కూడా సాధ్యమౌతుందని ఎన్నో శాస్త్ర సాక్ష్యాలు పరిశోధకులు చూపుతున్నారు.

### ఎటువంటి ఆహారం తినాలి?

మనిషి చక్కని ఆరోగ్యం, తగినంత బరువు ఉండడానికి పీచుపదార్థాలు ఎక్కువ, స్టార్చ్ అధికం, తక్కువ కొవ్వు, పంచదార, కేలరీలు గల ఆహారం భుజించమని నిపుణులు చెబుతున్నారు.

న్యాయపరమైన డోసులో విటమిన్లు, ఖనిజాలు ఆహారంలో తీసుకుంటే షుగర్‌వ్యాధి, కీళ్లవ్యాధులు, స్థూలకాయం వంటి రుగ్మతలకు దూరంగా ఉండొచ్చని సలహాలు ఇస్తున్నారు.

ప్రకృతివైద్య నిపుణులు కూడా ఆరోగ్యాన్ని ఆహార నియమాల్ని పాటించమని చెబుతున్నారు. హోమియోపతి, ఆయుర్వేదం ఇంకా ఇతర వైద్యవిధానాలు కూడా ఆహారనియమాలు ప్రవచిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకొమ్మని చెబుతున్నాయి.

ఎవరు ఏవిధమైన ఆహారం తినాలి అనే విషయం నిర్ణయించడానికి అతని గత వైద్యచరిత్ర అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ఎవరికి వారే ఏమి ఆహారం తినాలో నిర్ణయించుకోవడం శాస్త్రీయం కాదు. చాలా కుటుంబాల్లో వంట వండే ఇల్లాలు ఎటువంటి వంట, ఏరకమైన ఆహార పదార్థాలు చేయాలి? అనేదానిపై దృష్టి పెట్టేంత తీరుబడి, శక్తి ఉండకపోవడం జరుగుతోంది.

★

## పైనాపిల్ షేక్

**కావలసిన పదార్థాలు**

అనాసపండు - 1, నిమ్మకాయలు - 3
పంచదార - 2 కప్పులు, దాల్చిన చెక్క - కొంచెం
పైనాపిల్ ఎసెన్స్ - 2 చుక్కలు, మీగడ - కావలసినంత

**తయారు చేసే పద్ధతి**

అనాసపండు ముక్కలు చేసి మిక్సీలో వేయాలి. దీనికి కొంచెం నీళ్లు పోసి వడగడితే రసం వస్తుంది. నిమ్మకాయలు రసం తీసి పెట్టుకోవాలి. దాల్చినచెక్క పొడి చేసిపెట్టుకోవాలి. అనాసరసం, పంచదార, నిమ్మరసం, దాల్చినచెక్క పొడి, ఎసెన్సూ కలిపి ఒక పాత్రలో వేసి పొయ్యిమీదపెట్టి మరగబెట్టాలి. ఇది చల్లారిన తర్వాత ఐస్‌తో గానీ, ఒట్టిగా గానీ గ్లాసులో పోసుకుని తాగొచ్చు. తాగేముందు మీగడ కలుపుకుంటే ఇంకా బాగుంటుంది. అవసరమైతే మరికొన్ని నీళ్ళూ, పంచదార కలుపుకోవచ్చు.

## ఫ్రూటేడ్

**కావలసిన పదార్థాలు**

నిమ్మకాయ - 1, అనాసముక్కలు - 1 కప్పు
నారింజ కాయలు - 2, పంచదార - అరకప్పు, నీళ్లు - 2 కప్పులు

**తయారు చేసే పద్ధతి**

నిమ్మకాయ, నారింజ కాయలు రసం తీసి ఉంచుకోవాలి. అనాసముక్కలు మెత్తగా తరిగి పెట్టుకోవాలి. నిమ్మ, నారింజ కాయల రసంలో తరిగిపెట్టుకున్న అనాస ముక్కలు, పంచదార, నీళ్లూ కలిపి ఐస్ కూడా చేరిస్తే చాలా రుచిగా ఉంటుంది.

## లెమన్ పంచ్

**కావలసిన పదార్థాలు**

నిమ్మకాయలు - 2, పంచదార లేక తేనె - రుచికి సరిపడినంత
నారింజకాయలు - 2. అనాసగుజ్జు - అరకప్పు, నీళ్లు - 1 కప్పు




**తయారుచేసే పద్ధతి**

నిమ్మకాయలు, నారింజకాయలు రసం తీసి పెట్టుకోవాలి. దాన్ని అనాసగుజ్జులో కలపాలి. పంచదార లేక తేనె కలిపి నీళ్ల పొయ్యాలి. ఈ రసాన్ని గ్లాసులో పోసి అందులో ఐస్‌ముక్కలూ, నారింజ తొనలూ వేసుకుని తాగితే చాలా బాగుంటుంది.

## హనీ లెమన్

**కావలసిన పదార్థాలు**

తేనె - అరకప్పు, నిమ్మకాయలు - 4
ఐస్ - కావలసినంత, నీళ్లు - 4 కప్పులు
లెమన్ ఎసెన్స్ - 2 చుక్కలు

**తయారు చేసే పద్ధతి**

నిమ్మకాయలు రసం తీసి అందులో తేనె వేసి బాగా కలపాలి. తర్వాత నీళ్లూ, ఎసెన్సూ వేసి కలపాలి. గ్లాసులో నాలుగు ఐస్‌ముక్కలు వేసి అందులో ఈ రసం పోస్తే తాగడానికి ఎంతో రుచిగా ఉంటుంది. ఇది వేసవికాలంలో ఆరోగ్యానికి చాలా మంచిది.

## ద్రాక్ష రసం

**కావలసిన పదార్థాలు**

ద్రాక్షపళ్లు - పావుకిలో, పంచదార - పావుకిలో
నిమ్మకాయలు - 3, నారింజపండు - 1
ద్రాక్ష ఎసెన్సు - 1 చుక్క, ఐస్ - కావలసినంత

**తయారు చేసే పద్ధతి**

ద్రాక్షపళ్లు కడిగి పై తొక్క తొలగించి రసం తియ్యాలి. నిమ్మకాయలు రసం తీసి పెట్టుకోవాలి. నారింజపండు కూడా రసం తీసుకోవాలి. పంచదార, నీళ్లూ కలిపి తీగపాకం పట్టాలి. పాకం కొంచెం వేడిగా ఉండగానే ద్రాక్షరసం, నిమ్మరసం, నారింజరసం, ఎసెన్సు వేసి కలిపి ఈ మిశ్రమాన్ని చల్లారనివ్వాలి. దీన్ని ఒక బాటిల్లో పోసుకుని నిల్వ ఉంచుకోవచ్చు. కావలసినప్పుడు కొద్దిగా గ్లాసులో పోసుకుని దానికి నీళ్ల, ఐస్ కలిపి తాగితే చాలా బాగుంటుంది.

**- రమణి,** విజయవాడ.




### ఆహ్వానం

**ఘు**మఘుమలాడే వంటకాలు చేయడంలో మీకు ఎనలేని ఆసక్తి వుందా! ప్రయోగాత్మక వంటకాలు చేసి అతిథులకు వడ్డించి మెప్పించగలరా! చవులూరింపచేసే సంప్రదాయ శాకాలు చేయడంలో దిట్టా! ఎండన పడి వచ్చిన వారికి చిటికెలో చల్లని పానీయాలు అందించేస్తారా? మరెందుకండీ ఆలస్యం? ఎంచక్కా వాటిని ఓ కాగితం మీద రాసి పంపండి. తగిన పారితోషికం అందుకోండి. ముఖ్యమైన విషయం! మీ చిరునామా పూర్తిగా రాయడం మరువకండి.

**మీ రుచులు పంపాల్సిన మా అడ్రస్:**
**రుచి, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి,**
**మోటూరు హనుమంతరావు భవన్, 21/1,**
**అజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా,**
**హైదరాబాదు.**

# బాలనేస్తాలు

## ఎక్కడున్నాయో...

**నే**స్తాలూ...కింద బొమ్మలో చూడండి. ఎలుగుబంటి ఓ పెయింట్ బ్రష్ పట్టుకుని రంగు వేస్తుంది కదా. ఇందులో కొన్ని వస్తువులు, ప్రాణులు దాగున్నాయి. అవేంటో కింద ఇచ్చాం. వాటిని బట్టి అవి ఇందులో ఎక్కడున్నాయో వెతికి సున్నా చుట్టండే.



## పొడుపు కథలు

1 అమ్మ పెట్టే అట్లు.

2. అమ్మ రాక్షసిలా కనిపిస్తుంది. కానీ మాణిక్యం లాంటి బిడ్డనిస్తుంది.

3. అమ్మ కడుపులో పుట్టి, అరచేతి దెబ్బతిని, అగ్నిగుండంలో దూకాను.

4. అరంగుళం గదిలో అరవై మంది నివాసం.

5. అరచేయంత మడి, మడిలో నీరు, నీటిలో వేరు, వేరు చివర అగ్గి.



**ఏంటవి? చెప్పుకోండి చూద్దాం!**

## ఊర పిచ్చుక

**పి**చ్చుకల్లో ఇది మొదటిది. దీని శరీరం పై భాగం గోధుమ రంగు, పసుపు రంగు కలిసినట్లుగా ఉంటుంది. దానిపైన నల్లటి చారలు కూడా ఉంటాయి. ఉదర భాగం తెల్లగా వుంటుంది. ఇవి ఎక్కువగా మనుషులు సంచరించే ప్రదేశాల్లోనే నివశిస్తాయి. వీటి ప్రధాన ఆహారం తృణధాన్యాలు. ఇవి ఎక్కువగా పంట పొలాల్లో , పూల తోటల్లో, కూరగాయల తోటల్లో తిరుగుతుంటాయి. ఇలా రైతు కోపానికి గురవుతాయి. అయితే కొన్ని సార్లు పంటపొలాల్లోని కీటకాలను తిని వ్యవసాయదారునికి మేలూ చేస్తాయి. ఇవి ఇంటి చూరుల్లో ఎండు గడ్డితో గూడు కట్టుకుంటాయి. ఇవి ఒకేసారి మూడు నుండి ఐదు వరకు గుడ్లు పెడతాయి. అయితే ప్రస్తుతం వాతావరణ కాలుష్యం కారణంగా ఇవి కనుమరుగైపోతున్నాయి.







## దారి చెప్తారా...!

**హా**య్.. ఇక్కడున్న కుందేలుకు భలే ఆకలిగా ఉందంట. దానికి దూరంగా రెండు క్యారెట్లు కనిపించాయి. అయితే వాటి దగ్గరికి వెళ్లడానికి దారి సరిగా లేదు. అందుకే వెళ్లలేక అలాగే కూర్చుండిపోయింది. మీరు సాయం చేసి దారి చూపిస్తే ఎంచక్కా వెళ్లి క్యారెట్లను తినేస్తుంది. మరి చెప్పేస్తారుగా.

## వెతికేద్దామా...!

**ఫ్రెండ్స్**... ఇక్కడ కొన్ని ఆంగ్ల అక్షరాలు వున్నాయి కదా. వాటి కిందే కొన్ని పదాలు కూడా ఉన్నాయి. ఆ పదాలు పైనున్న అక్షరాల్లో నిలువుగా, అడ్డంగా, వంకరగా ఎలాగైనా వుండొచ్చు. వాటిని వెతికి సున్నా చుట్టండే!

| | | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| O | O | E | G | N | J | S | I | B | P | K | D | H | E | H | V |
| S | E | S | M | Z | R | N | R | E | R | E | D | G | S | D | F |
| H | T | E | S | I | U | A | C | A | K | B | R | N | J | S | N |
| D | E | Z | C | U | L | G | D | K | P | E | P | G | O | A | S |
| O | R | M | D | G | E | J | T | E | C | E | I | P | O | V | D |
| C | I | C | N | H | A | G | Z | N | F | E | E | D | N | S | O |
| S | U | T | E | L | J | G | O | N | G | Z | A | T | A | T | K |
| L | W | B | O | P | L | F | N | K | S | E | T | G | P | S | U |
| E | O | C | E | A | R | I | S | F | S | H | I | P | Q | A | D |
| W | L | N | X | E | U | P | B | L | G | O | U | N | S | G | A |
| E | D | H | N | N | T | V | W | I | E | O | B | N | T | P | C |
| T | V | B | I | G | O | O | N | G | R | T | E | O | T | R | T |
| Z | A | R | S | J | E | G | E | H | M | D | Y | Z | R | P | N |
| I | L | M | T | H | O | G | S | T | P | H | S | D | O | B | S |
| T | Z | J | C | Q | A | S | T | Z | N | F | R | D | H | S | S |
| S | E | Y | E | I | N | W | E | I | R | C | J | E | T | N | V |

owls, hoot, bird, night, nest, beak, flight, hunt, dark

## దేనికెన్ని?

**నేస్తాలూ** మీకు తేనెటీగలకు, సాలెపురుగులకు ఎన్ని కాళ్లుంటాయో తెలుసా? తెలిస్తే ఈ చిన్న లెక్క చెయ్యండి. బంటి కొన్ని తేనె టీగలను , సాలె పురుగులను పట్టుకుని ఒక డబ్బాలో వేశాడు. అవి మొత్తం ఎనిమిది ఉన్నాయి. వాటి అన్నిటి కాళ్ల లెక్కబెడితే 54 ఉన్నాయి. వాటిలో ఎన్ని తేనెటీగలున్నాయో, ఎన్ని సాలెపురుగులున్నాయో చెప్పండి.

## ఎన్ని పేజీలు తిన్నదో...!

**ఒ**క అల్మరాలో రెండు పెద్ద పెద్ద పుస్తకాలున్నాయి. ఒక్కో పుస్తకంలో 800 పేజీలున్నాయి. ఒక పుస్తకాల పురుగు అదే అల్మరాలో ఈ చివరి నుండి ఆ చివరి వరకు తిరుగుతూ పుస్తకాలను తింటోంది. అలా మొదటి పుస్తకంలోని మొదటి పేజీనుండి రెండవ పుస్తకంలోని చివరిపేజీ వరకు తినేసింది. అంటే ఇప్పుడు ఆ పుస్తకాల పురుగు మొత్తం ఎన్ని పేజీలను తినేసింది.



## దాగున్నదేంటో?

**హలో**... ఇక్కడి చుక్కల్లో ఎవరో దాక్కున్నారు. వారెవరో తెలియాలంటే 1 నుంచి 43 వరకు ఉన్న చుక్కల్ని వరుసగా కలిపేయండి.





## రెండుతో మూడు ఎలా?

**పి**ల్లలూ... అగ్గి పుల్లలతో చేసిన రెండు చతురస్రాలు కనిపిస్తున్నాయి కదా. దాల్లోని మధ్యలో ఉన్న చతురస్రాన్ని కదిలించి మొత్తం మూడు చతురస్రాలు చెయ్యాలి. చేస్తారా మరి.

రెండుతో మూడు ఎలా?



**దేనికెన్ని?** : తేనెటీగకు 6 కాళ్లుంటాయి. సాలెపురుగుకు 8 కాళ్లుంటాయి. 5 తేనెటీగలు, 3 సాలెపురుగులు ఉన్నాయి. 5 తేనెటీగలు×6=30 కాళ్లు. 3 సాలెపురుగులు×8=24 కాళ్లు. మొత్తం 30+24=54. **ఎన్ని పేజీలు తిన్నదో...!** : రెండు పేజీలు. ఎలా అంటే పుస్తకాల పురుగు ఆ చివరి నుండి ఈ చివరి వరకు తిరుగుతుంది అన్నాం కదా. అంటే మొదటి పుస్తకంలోని మొదటి పేజీ అంటే అట్టను మాత్రమే తిని తర్వాత రెండో వైపుకు వెళ్లి రెండో పుస్తకానికి పైనున్న చివరి పేజీ తింది. అంటే మొత్తం రెండు పుస్తకాల్లోని అట్టలు మాత్రమే తింది. **పొడుపు కథలు:** 1.చీవాట్లు 2.మొగలి పువ్వు, 3.పిడక, 4.అగ్గిపెట్టె, 5.దీపం

# మాటల కోట - 44

రూపకల్పన : కర్లపాలెం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | | 3 | 4 | 5 | | | 6 |
| | 7 | 8 | | 9 | | | | |
| 10 | | 11 | 12 | | | 13 | | 14 |
| 15 | 16 | | 17 | | 18 | | 19 | |
| 20 | | | | | | | 21 | |
| | | 22 | | | | 23 | | |
| | 24 | | | | | 25 | 26 | |
| 27 | | | | 28 | 29 | | 30 | 31 |
| 32 | | | 33 | | | | | |

**అడ్డం :**

1. లేటెస్ట్ (తెలుగులో) (2)
3. విశ్వనాథ్ ఆనంద్ ఆడే ఆట (4)
6. శ్రీవారు శ్రీమతిలో కామన్‌గా ఉండేది (1)
7. గుర్రం గిట్టకి కొట్టేది (2)
9. మాట్లాడే సెలయేరు (2)
11. దారి (2)
15. ధాన్యపుగింజ (2)
17. పాలకుడు చేసే పని (3)
19. తినడానికి తిండి లేదుగానీ... దీనికి సంపెంగ నూనె (2)
20. తడి (2)
21. పరీక్షల్లో ఇది బాగుంటే మంచి మార్కులు పడతాయంటారు (2)
22. ఇనుమును ఇట్టే ఆకట్టుకునేది (5)
24. ఇవి వస్తున్నాయి... జాగ్రత్త! అంటూ ఏకంగా ఒక నవలే రాశాడు . మల్లాది వెంకట కృష్ణమూర్తి (3)
25. సత్యం. ఇది రావిశాస్త్రి గారి నాటకం!(2)
27. అమ్మకు అమ్మ (3)
28. అటునుండి బరిలోకి! (2)
30. రైట్! ఎడమ కాదు (2)
32. రకాలు కి ఏకవచనం (2)
33. ఇవాళ ఏ వారం? (4)

**నిలువు :**

2. ఈ చేతి కొలతకి చివర రెడ్డి చేరితే మన మాజీ హోంమంత్రి (2)
4. మందు (2)
5. వర్ణం (2)
8. మిద్దె (2)
10. ఈ సినీ కథానాయకుడే 'ఇడియట్... (4)
12. దీపావళి నాడు టపటపా పేలే కాయలు (5)
13. లాయరులోనే చట్టం ఉంది (1)
14. చెట్టూ చేమా పుష్పించే కాలం (4)
16. తాగితే వచ్చేది. డోసు ఎక్కువైందేమో. చూడు ఎలా తిరగబడిందో! (2)
18. మనిషి నడిచే తీరు (3)
19. మీరా ?... కృష్ణ భక్తురాలనుకున్నానే! (2)
22. మావయ్య భార్య (3)
23. మౌనంగా ధ్యానం చేసుకునే యోగి (2)
24. విశ్వాసం (3)
26. బిడియం (2)
27. సగం, గూడు (2)
28. పెంచే తల్లి (2)
29. కొంకణి తీరంలో ప్రసిద్ధ సముద్రతీరం. ఈ వారం 'చూద్దామా' దీని గురించే (2)
31. మిథున్ చక్రవర్తి, అయామ్ ఎ '– –' డాన్సర్ అంటూ ఉర్రూతలూపేశాడు మరి! (2)

**మాటలకోట - 43జవాబు**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 మా | ల | 2 ప | ల్లి | | 3 వా | 4 మ | ప | క్ష |
| | | ది | | 5 ఋ | | లై | | |
| 6 బా | 7 న | | 8 ఉ | డు | ము | | 9 కా | 10 క |
| 11 వ | ది | 12 న | | గు | | 13 అ | మ | ల |
| | | 14 ర | ణం | | 15 బే | ల | | |
| 16 రా | 17 గ | ము | | 18 క్రి | | 19 క | 20 వి | 21 త |
| 22 జా | డి | | 23 రా | కె | ట్ | | 24 ల్లు | క |
| | | 25 లు | | ట్ | | 26 కో | | |
| 27 ఘం | ట | సా | ల | | 28 గు | ర | జా | డ |

# ముగ్గురు అక్కచెల్లెళ్లు



- కె.సాహిల్

అనగనగా ఓఅడవి. దానికి దగ్గర్లో ఒక పల్లెటూరు. అడవికి, ఊరికి మధ్యలో ఒక చిన్న ఇల్లు వుండేది. అందులో ముగ్గురు అక్కచెల్లెళ్లు నివసించేవారు. వారి అమ్మానాన్నా చిన్నప్పడే చనిపోయారు. వున్న పశువులను మేపుకుంటూ ఎలాగో జీవించేవారు. అయితే ముగ్గురు అక్కచెల్లెళ్లకూ ఓ ప్రత్యేకత వుంది. అదేమంటే మొదటి అమ్మాయికి ఒకటే కన్ను వుండేది. రెండో అమ్మాయికి రెండు కళ్లు వుండేవి. మూడో అమ్మాయికి మూడు కళ్లు వుండేవి. మధ్యలో అమ్మాయంటే పెద్ద అమ్మాయికి, చిన్న అమ్మాయికి ఇష్టం వుండేది కాదు. ఆమెకు తమలా కాకుండా రెండు కళ్లూ సరిగా వున్నాయని వారికి అసూయ. దాంతో ఆమెను ఎప్పడూ బాధపెడుతుండేవారు. పనులన్నీ తనతోనే చేయించేవారు. తిండి దగ్గరకొచ్చేసరికి మంచి ఆహారం అంతా తాము తినేసి మిగిలిపోయినవి, కుళ్లిపోయినవి, పాచిపట్టినవి ఆమెకు ఇస్తుండేవారు. నా అన్నవారు లేక...తోబుట్టువులు పెట్టే కష్టాలన్నిటిని భరిస్తూ వుండేది రెండో అమ్మాయి. అయితే మేకలను మేపుకురావడానికి అడవికి వెళ్లినప్పడు మాత్రం అక్కడ కూర్చుని ఏడ్చేది. తన కష్టాలు ఎప్పడు తీరతాయా అని రోదించేది.

ఓసారి ఎప్పటిలాగే మేకలను మేపుకురావడానికి అడవికి వెళ్లింది. మధ్యాహ్నం వరకూ అక్కడే మేకలతోపాటే ఎండలో వుంది. విపరీతమైన ఆకలి వేసింది. ఎండకు నోరు పిడచకట్టుకుపోయింది. తాగడానికి కనీసం దగ్గర్లో నీళ్లు కూడా లేక అల్లాడిపోయింది. ఆకలిదప్పికలను ఓర్చుకోలేక కిందపడి పెద్దగా ఏడ్చేసింది.

అప్పడు ఆమె దగ్గరకు ఓ అవ్వ వచ్చి...

'అమ్మాయీ...ఎందుకేడుస్తున్నావు?" అనడిగింది.

"అవ్వా...నేను నిన్ను ఎప్పడూ చూడలేదే! నువ్వు ఈ ఊరికి కొత్తగా వచ్చావా?" అంది ఆశ్చర్యంగా.

"నా సంగతి వదిలేయ్ అమ్మాయ్. నీ గురించి చెప్ప. ఎందుకేడుస్తున్నావ్?" అంది మళ్లా.

"అంతా నా తోబుట్టువుల వల్లే అవ్వా. చూడు నాకు తినడానికి ఏమీ ఇవ్వకుండానే సాయంత్రం వరకు ఈ మేకలను మేపుకు రమ్మని పంపారు. మేకలకేం హాయిగా ఇక్కడ గడ్డి, ఆకులు తింటూ వుంటాయి. మరి నా సంగతో! ఆకలితో పొట్ట నొప్పి పుడుతోంది..." అంది దీనంగా మొహం పెట్టి.

"ఓ... అదా సంగతి! అయితే ఇదిగో చూడు. ఈ మేకే నీకు ఆహారం తెచ్చిస్తుంది. 'ఓ మే...మే...మేకా! నాకు తినడానికి ఏదైనా కావాలి. ఇవ్వు' అంది.

అంతే వెంటనే అక్కడ ఓ బల్ల ... బల్ల మీద రకరకాల ఆహార పదార్థాలు వచ్చేశాయి. అన్నీ ఘుమఘుమలాడిపోతున్నాయి. చూడగానే నోరూరి పోయింది రెండో అమ్మాయికి. వెంటనే గబగబా కొన్ని పదార్థాలు తినేసింది. తర్వాత నీళ్లు తాగింది.

"మరి ఇవన్నీ ఏం చేయాలి? వాటిని మా వాళ్లు చూశారంటే...నన్ను చంపేస్తారే" అంది అనుమానంగా వాటిని చూస్తూ.

"ఊ... దానికీ ఓ ఉపాయం వుంది. చూడు. మే...మే...మేకా...ఇంక ఇవి అవసరం లేదు' అంది అంతే... మిగిలిపోయిన పదార్థాలన్నీ మాయమైపోయాయి. దానికి రెండో అమ్మాయి ఎంతగానో సంతోషించి అవ్వకు ధన్యవాదాలు చెప్పకుంది.

అప్పడు అవ్వ "ఓ అమ్మాయీ! నీకు ఆకలేసినప్పడల్లా ఇలా చేయి. హాయిగా కడుపు నిండా భోంచేయి' అని వెళ్లిపోయింది.

ఆరోజు ఇంటికి ఎంతో సంతోషంగా వెళ్లిందామె. పాటలు పాడుకుంటూ ఇంట్లో పనంతా చేసేసింది. ఇదంతా ఇద్దరు అక్కచెల్లెళ్లు గమనిస్తూనే వున్నారు. తాము తినగా మిగిలిపోయిన పదార్థాలను ఒక గిన్నెలో వేసి ఇచ్చారామెకు. కానీ ఆమె అవేమీ తినకుండానే తన గదిలోకి వెళ్లి నిద్రపోయింది. తెల్లారాక గిన్నెలో పదార్థాలు అలాగే వుండడం చూసి ఆశ్చర్యపోయారు అక్కచెల్లెళ్లు. ఏదో జరిగిందని మాత్రం అనుకుంటారు. అది కనిపెట్టాలని కూడా అనుకుంటారు. మరురోజు ఉదయాన్నే మేకలు కాయడానికి వెళుతున్న రెండో అమ్మాయి వెంట మొదటి అమ్మాయి కూడా వెళుతుంది అడవికి.

ఆ విషయం పసిగడుతుంది రెండో అమ్మాయి. అందుకే ఆకలి వేసినాగానీ మేకను ఆహారం అడగకుండా అలాగే వుండిపోతుంది. అలా సాయంత్రం తిరిగి మేకలను తీసుకుని ఇంటికి వెళుతుంది. ఆరోజు ఇచ్చిన పాచిపోయిన అన్నాన్ని తినేస్తుంది. కానీ ఏడుస్తూ పడుకుండిపోతుంది.

మరునాడు మరలా అడవికి మేకలను తీసుకెళుతుంది. ఆరోజు కూడా మొదటి అమ్మాయి తనను అనుసరించడాన్ని గమనిస్తుంది. ఇంక చేసేదేం లేక అలా తిండి లేకుండానే వుండిపోతుంది. కానీ ఆకలికి ఆగలేక పేద్దగా ఏడుస్తుంది. అవ్వ వస్తుంది మళ్లా. అప్పడు రహస్యంగా విషయం అంతా చెప్తుంది రెండో అమ్మాయి.

"ఇదా నీ సమస్య! అయితే నీకు ఒక పాట నేర్పిస్తాను. దాన్ని పాడు. అప్పడు నీ అక్కయ్య నిద్రపోతుంది" అంటూ పాట నేర్పిస్తుంది.

"అక్కా...చుక్కా...నీ ముద్దుల చెల్లి పాడుతోంది. నిద్ర పో అక్కా ఎంచక్కా!" అంటూ పాట పాడింది.

**(ఆ తర్వాత ఏమైందో తెలియాలంటే...వారం రోజులు వేచి చూడాల్సిందే!)**



# విలాసాల ఓడ



నౌకంటే నౌకా కాదు. పడవంటే పడవా కాదు. పదిలంగా కట్టుకున్న ఓడా మాది... అని పాడుకోవచ్చు ఇకమీదట. చూశారుగా. ఎంత హుయలు పోతోందో ఈ ఓడ. గుర్రపు నాడా ఆకారంలో నీలినీళ్లల్లో తేలియాడుతోన్న ఈ ఓడ వివరాలు చెప్తే మన కళ్లు కూడా తిరిగిపోతాయి. ముందుగా దీని ధర గురించి చెప్పకుందాం. సింపుల్‌గా 20 మిలియన్ యూరోలు ఇచ్చేస్తే మీ వాకిట్లోకి వస్తుందిది. అంత ధైర్యం ఎవరు చేస్తారు చెప్మా! అనుకోకండి. శతకోటీశ్వరుడు ముఖేష్ అంబానీ ఆ పని చేసేశాడు. ఈ పడవ పొడవు 58 మీటర్లు. వెడల్పు 38 మీటర్లు. దీనికి కావాల్సిన విద్యుత్తులో కొంత భాగం ఓడమీదే తయారౌతుంది. అదీ భానుడి సహకారంతో. విషయం అర్థమైందనుకుంటా! ఔను! సోలార్ ఎనర్జీ తయారౌతుంది. మిగతాదంతా మామూలు విద్యుత్. ఇంక ఈ ఓడలో ఎంచక్కా 12 మంది అతిథులు, 20 మంది పనివారు వుండొచ్చు. ఇక్కడ ఒక హెలిప్యాడ్, స్పా, చదువుకునే గది, జిమ్, మసాజ్ గది, సంగీతశాల, భోజనశాల, థియేటర్, సన్ బాత్ సదుపాయాలూ...వున్నాయి. ఇవి మొత్తం మూడు అంతస్తుల్లో వుంటాయి. ఎక్కడం దిగడం కష్టం కదా అనుకుంటున్నారేమో! ఆ కష్టం లేకుండా ఎలివేటర్ వుందిలెండి. ముఖేష్ అంబానీ దీన్ని తీసుకొచ్చి ముంబైలోని బ్రీచ్‌క్యాండీ ఒడ్డున కట్టేస్తాడు. మనసు పడినప్పుడు ఆ ఓడలో సతీసమేతంగా 'లాహిరి లాహిరి లాహిరిలో...' అని పాడుకుంటూ విహరిస్తాడు.